ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
కర్ణాటక వార్తలు
మంగళవారం 25 నవంబరు 2025



కేఆర్ఐడీఎల్ ఏఈఈపై మండిపడుతున్న మంత్రి భోసరాజు

పరిహారం ఇస్తాం..
పల్లె వీడండి

- అమగావ్ గ్రామస్థులకు అధికారుల ఆదేశం
- రాష్ట్రంలో చిట్టచివరి గ్రామం.. గోవాకు సమీపం
- అనారోగ్యం పాలయితే ఏడు కిలోమీటర్లు డోలీ ప్రయాణమే
- ఖాళీ చేయించాలని యంత్రాంగం నిర్ణయం
- రూ.15 లక్షలు ఇచ్చినా ససేమిరా అంటున్న స్థానికులు



అమగావ్‌లో ఓ కార్యాలయం



గ్రామస్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ (ఫైల్)

బెంగళూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): అటవీప్రాంతానికి అనుబంధంగా నివసిస్తున్నారని ఈ ప్రాంతం వీడాలని బెళగావి జిల్లా యంత్రాంగం చేస్తున్న హెచ్చరికలతో ఆ గ్రామస్థులు విలవిలాడుతున్నారు. దశాబ్దాలకాలంగా జీవనం సాగిస్తున్న తాము ఎటు వెళ్లాలో దిక్కుతోచని పరిస్థితుల్లో కొట్టుమిట్టాడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గోవా రాష్ట్రానికి ఆనుకుని కర్ణాటకలో చిట్ట చివరి గ్రామం అమగావ్ అడవిఅంచున ఉంది. దశాబ్దాలకాలంగా ఇక్కడ నివసిస్తున్నా కనీస సౌకర్యాలు కూడా లేవు. ప్రస్తుతం గ్రామాన్ని విడిచి వెళ్లాలని బెళగావి జిల్లా యంత్రాంగం ఆదేశాలతో ఒక్కసారిగా గ్రామస్థులంతా అయోమయంలో పడ్డారు. ఖానాపుర తాలూకా భీమగడ అభయారణ్యంలో ఉన్న తళేవాడి గ్రామాన్ని ఇప్పటికే స్థలాంతరం చేశారు. తళేవాడికి సమీపంలోనే అమగావ్ గ్రామం నుంచి ప్రజలనుంచి ఇతర ప్రాంతాలకు తరలించాలనే ప్రక్రియను అధికారులు ప్రారంభించారు. అమగావ్ గ్రామం రాష్ట్రంలో అత్యధిక వర్షం కురిసే ప్రాంతంగా పేరొందింది. ఇది గోవా రాష్ట్రానికి సమీపంలోనూ, కర్ణాటక రాష్ట్రంలో చిట్టచివరి పల్లెగా ఉంది. 80 కుటుంబాలకు సంబంధించి 565మంది నివసిస్తున్న కుగ్రామమిది. చుట్టూ దట్టమైన అడవి, వన్యప్రాణులు నివసించే ప్రాంతం. పచ్చటి వాతావరణం, ప్రకృతి సౌందర్యం వికసిస్తుంది. వీరు పౌరసమాజానికి సుదూరంగా ఉన్నారు. రవాణా సౌకర్యం లేదు, మొబైల్ నెట్‌వర్క్ అనేది వీరికి తెలియదు. వర్షాకాలంలో మూడు నెలలపాటు రాత్రివేళల్లో లాంతర్ల వెలుగుతోనే జీవనం సాగిస్తారు.

అనారోగ్యం అంటే.. మోసుకుపోవాల్సిందే..

దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 80 ఏళ్ల కావస్తున్నా అమగాంవ్ గ్రామంలో ఇప్పటికీ మౌలిక సదుపాయాలు లేవు. జిల్లాకేంద్రమైన బెళగావి 53 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. గ్రామం నుంచి రోడ్డెక్కాలంటే 7 కిమీ దూరంలోని చికలె గ్రామానికి చేరుకోవాల్సి ఉంటుంది. బైక్‌పై ప్రయాణం చేయవచ్చుగానీ అది పగటివేళల్లో మాత్రమే సాధ్యమవుతుంది. పైగా వర్షాకాలంలో బైక్‌పై వచ్చే అవకాశం ఉండదు. గ్రామానికి చెందినవారికి అత్యావసరమైతే 7 కిలోమీటర్ల మేర రోగిని భుజాలపైనా లేదా డోలీ పద్ధతిలో తీసుకెళ్లాల్సి ఉంటుంది. గ్రామానికి అంబులెన్స్ వచ్చే అవకాశమే లేదు. ఇలా సకాలంలో ఆసుపత్రికి వెళ్లలేక అత్యవసర చికిత్స అందక ఎంతోమంది ప్రాణాలు కోల్పోయిన సందర్భాలూ ఉన్నాయి. 13ఏళ్లక్రితం అమగాంవ్‌కు విద్యుత్ సౌకర్యం కల్పించారు. గ్రామంలో సీసీ రోడ్లు, తాగునీటి వ్యవస్థ ఏర్పాటు చేశారు. ఇక్కడి వారిలో అధికమంది మరాఠీలు ఉన్నారు. 1 నుంచి 7వ తరగతి వరకు మరాఠీమీడియం యూపీ స్కూల్ ఉంది. 14మంది పిల్లలు చదువుతున్నారు. 28ఏళ్లుగా నింగప్ప బాళెకుంద్రి టీచర్‌గా పనిచేస్తున్నారు. రూపేశ్‌బాలాజి గెస్ట్ టీచర్‌గా ఉన్నారు.

ఆకట్టుకుంటున్న ప్రకృతి

ఈగ్రామాన్ని ఒకసారి సందర్శిస్తే అక్కడి ప్రకృతిలో ఎవరైనా మమేకం అవుతారు. అక్కడనుంచి వెనుదిరిగి వచ్చేందుకు మనస్సు ఒప్పదు. కానీ అక్కడే నివాసం ఉండడం అసాధ్యమే. గ్రామానికి చెందినవారు ఉన్నతవిద్యకు వెళ్లినవారే లేరు. విద్యార్థులు పదో తరగతి దాకా చదవడమే గొప్ప అనిపిస్తోంది. ఏడో తరగతి దాకా సునాయాసంగానే చదువుతారు. కానీ ఆ తర్వాత వెళ్లడం కష్టతరంగా అనిపిస్తోంది. ఎక్కువమంది అడవిలో లభించే వస్తువులను సేకరించి గోవాలో విక్రయించేందుకు తీసుకెళ్తారు. అక్కడే వారం, పదిరోజులు కూలి పనులు చేసి వెనుదిరుగుతారు. రోజువారి పనికి వెళ్లి రావడం సాధ్యం కాని పరిస్థితి. గ్రామంలో వృద్ధులు, పిల్లలు, మహిళలే అత్యధికంగా ఉంటారు. పురుషులు గోవాలో వలస కూలీలుగా కొనసాగుతుంటారు. ఈ గ్రామానికి చెందినవారికి పెళ్లిళ్లు కావడం కష్టంగా మారిపోయింది. స్థానికుల్లో అమ్మాయి ఉంటే మాత్రమే పెళ్లి జరుగుతుంది. ఇతర ప్రాంతాలకు చెందినవారు గ్రామస్థులతో సంబంధం పెట్టుకునేందుకు వెనుకడుగు వేస్తారు. నిత్యావసరాలు, రేషన్ బియ్యం వంటి వస్తువుల కోసం జాంబోటి కానీ ఖానాపురకు వెళ్లాల్సి ఉంటుంది. ప్రస్తుతం అమగాంవ్ గ్రామం నుంచి ప్రజలను ఇతర ప్రాంతాలకు తరలించాలని జిల్లా యంత్రాంగం సిద్ధమైంది. అందుకు గ్రామస్థులు కూడా సిద్ధమయ్యారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ఓ కుటుంబానికి రూ.15లక్షలు ఇచ్చే వెసలుబాటు ఉంది. అయితే రూ.15లక్షలు తీసుకుని ఊరి వదిలితే మరో చోట ఇళ్ల నిర్మాణంతోపాటు జీవనం కష్టమవుతుందని వెనుకడుగు వేస్తున్నారు. పైగా గ్రామంలో అందరికీ పంటలు పండించేలాంటి భూమి ఉంది. ఇల్లు, ఇంటి స్థలాలు కూడా ఉన్నాయి. మరోచోటుకు వెళ్తే భూములు లేనందున కూలీలుగా మారాల్సి ఉంటుంది. ఇవన్నీ పరిగణనలోకి తీసుకుని పరిహారం అందించాలని డిమాండ్ చేస్తున్నారు.

వచ్చే ఏడాది తరలింపు..!

అమగాంవ్ గ్రామానికి సమీపంలో ఉండే తళెవాడిని మరో ప్రాంతానికి తరలించారు. ఇక మిగిలింది కేవలం అమగాంవ్ గ్రామానికి చెందినవారు మాత్రమే. గ్రామస్తుల పేరిట 90 ఎకరాల భూమి ఉంది. అయితే అంతకంటే ఎక్కువ విస్తీర్ణంలో సాగుతో జీవనం చేస్తున్నారు. భూమికి ప్రత్యామ్నాయంగా భూమి ఇవ్వాలని కోరుతున్నారు. గ్రామంలో రెండున్నర దశాబ్దాలుగా ఉపాధ్యాయుడిగా పనిచేసిన నింగప్పబాళెకుంద్రి అభిప్రాయం మేరకు గ్రామంలో మౌలిక సదుపాయాల కొరత ఉంది. పిల్లల భవిష్యత్తు దృష్ట్యా ఈ ప్రాంతాన్ని వీడడం సమంజసం. అటవీశాఖ ప్రతి కుటుంబానికి, 18ఏళ్లు పైబడినవారికి 15 లక్షల రూపాయలు పరిహారంగా ఇచ్చినా మరోచోటుకు వెళ్లి జీవనం చేయడం కష్టంగా ఉంటుంది. స్థానికుల భూమికి కూడా పరిహారం ఇవ్వాలన్నారు. ఏ ప్రాంతానికి తరలించినా కొంత సాగుభూమి, శాశ్వతమైన ఇల్లు కల్పిస్తే గ్రామస్థుల భవిష్యత్తుకు ఢోకా ఉండదని పేర్కొంటున్నారు.

పనులు ప్రారంభించకపోతే

కట్టేసి కొడతా

- అధికారిపై మంత్రి భోసరాజు ఆగ్రహం
- వివాదాస్పదంగా మారిన వ్యాఖ్యలు
- అధికారుల ఆగ్రహం

రాయచూరు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి) : రోడ్డు పనులకు భూమి పూజ చేసి ఎన్నాళ్లైంది..ఇంకా పనులు ప్రారంభించరా... ఇలాగే నిర్లక్ష్యం వహిస్తే కట్టేసి కొడతా అంటూ మంత్రి భోసరాజు ఓ అధికారిపై ధ్వజమెత్తారు. సోమవారం రాయచూరు జిల్లా సిరవార తాలూకా మరాఠ గ్రామం వద్ద పలు అభివృద్ధి పనులను మంత్రి పరిశీలించారు. అక్కడ రోడ్డు పనులు ప్రారంభం కాకపోవడం, పాఠశాల నిర్మాణ పనులు మధ్యలోనే ఆగిపోయి ఉండడాన్ని చూసి సంబంధిత అధికారుల పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక దశలో సహనం కోల్పోయిన మంత్రి రోడ్డు పనులకు భూమిపూజ చేసి ఎన్నాళ్లైంది ఎందుకు ప్రారంభించలేదంటూ కేఆర్ఐడీఎల్ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్(ఏఈఈ) హనుమంతప్పను నిలదీశారు. పనులు ప్రారంభించకపోతే సస్పెండ్ చేస్తానంటూ హెచ్చరించడంతో పాటు పాటు ఒక దశలో అసహనం కోల్పోయి పనులు ప్రారంభించకపోతే కట్టేసి కొడతానంటూ వ్యాఖ్యానించారు. అయితే మంత్రి వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఆయన వ్యాఖ్యలపై పలువురు అధికారులు మండిపడుతున్నారు. మంత్రి వెంట రాయచూరు ఎంపీ కుమార్ నాయక్, మాన్వి ఎమ్మెల్యే హంపయ్య నాయక్ తదితరులున్నారు.

కెనరా బ్యాంకు ఈడీగా సునీల్‌కుమార్ ఛఘ్



బెంగళూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): కెనరాబ్యాంకు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా సునీల్‌కుమార్ ఛఘ్ నియమితులయ్యారు. ఆయన ఇదివరకు పంజాబ్ నేషనల్‌బ్యాంకులో చీఫ్ జనరల్ మేనేజర్‌గా సేవలందించారు. బ్యాంకింగ్ రంగంలో 30ఏళ్లకుపైగా అనుభవం కల్గిన ఛఘ్, పంజాబ్ నేషనల్ బ్యాంకులో పనిచేసేసిన వేళ పలు మార్పులను విజయవంతంగా అమలు చేశారు. డిజిటల్, రిటైల్, కార్పొరేట్ బ్యాంకింగ్ వ్యూహాలకు విశేష కృషి చేశారు. రిస్క్ మేనేజిమెంట్, క్యాంపెయిన్స్ క్రెడిట్ మానిటరింగ్ వ్యవస్థలను బలోపేతం చేయడంలో ఆయన నాయకత్వం పలు ప్రశంసలు అందుకుంది. కోల్కత్తా, అహ్మదాబాద్, ముంబైలోని కార్పొరేట్ బ్రాంచ్‌లలోను, భారతీయ ఓరియంటల్ బ్యాంక్ ఆఫ్ కామర్స్‌లోని కార్పొరేట్ ఆఫీస్, ఇతర కంట్రోలింగ్ కార్యాలయాలలో కీలక బాధ్యతలు నిర్వహించారు. కార్పొరేట్ క్రెడిట్, విదేశీ మారక, సంక్షోభగ్రస్త ఆస్తుల పునరుద్ధరణ - పరిష్కారం, క్రెడిట్ మానిటరింగ్ వంటి విభిన్నరంగాలపై ఆయనకు అపార అనుభవం ఉంది. ఇవన్నీ ఆయన నాయకత్వ సామర్థ్యాన్ని బలోపేతం చేస్తాయి. ఛఘ్ నియామకంతో బ్యాంకు నాయకత్వ బృందం మరింత బలోపేతం అవుతుందని సోమవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.

రూ 7 కోట్ల చోరీ కేసులో మరో ఇద్దరి అరెస్టు



బెంగళూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఏటీఎంలకు నగదు నింపేందుకు వెళ్తున్న సీఎంఎస్ వాహనంలో రూ.7.11కోట్ల నగదు చోరీ కేసులో మరో ఇద్దరు నిందితులను బెంగళూరు దక్షిణ విభాగం పోలీసులు అరెస్టు చేశారు. చెన్నైలోని దినేశ్, జినేశ్ అనే ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. కేసుకు సంబంధించి ప్రముఖ నిందితులను అరెస్టు చేశామని బెంగళూరు నగర పోలీస్ కమిషనర్ సీమంత్‌కుమార్‌సింగ్ మీడియాతో సోమవారం తెలిపారు. అంతకుముందు సీఎంఎస్ సెక్యూరిటీస్ కస్టోడియన్ వాహనం అధికారి గోపాల్ ప్రసాద్, మాజీ ఉద్యోగి జేవియర్, గోవిందపుర పోలీస్‌స్టేషన్ కానిస్టేబుల్ అణ్ణప్పనాయక్, చోరీకి సహకరించిన నవీన్, నెల్సన్, రవిలను అరెస్టు చేశారు. ఇంతవరకు కేసుకు సంబంధించి మొత్తం రూ.6.29 కోట్లు రికవరీ చేశామన్నారు. ఈనెల 19న ఏటీఎంలకోసం నగదు నింపేందుకు వెళ్తున్న వాహనాన్ని ఆర్‌బీఐ అధికారుల నెపంతో దుండగులు అడ్డగించి చోరీకి పాల్పడిన సంగతి తెలిసిందే.

ఖజానాలో నిధులకు కొదవ లేదు

- ముఖ్యమంత్రి సిద్దరామయ్య
- బీజేపీవి అసత్య ప్రచారాలని ఆగ్రహం
- ఒకేరోజు రూ. 2వేల కోట్ల పనులకు శ్రీకారం



ప్రజలకు అభివాదం చేస్తున్న సీఎం సిద్దరామయ్య

శిడ్లఘట్ట, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఖజానాలో నిధులకు కొరత లేదని, ఖాళీ అయ్యిందన్న బీజేపీ ప్రచారం అబద్ధమని సీఎం సిద్దరామయ్య అన్నారు. బయలుసీమ ప్రాంతమైన చిక్కబళ్ళాపుర జిల్లా శిడ్లఘట్ట తాలూకాలో ఒకేరోజు సుమారు రూ.2వేల కోట్ల అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి సిద్దరామయ్య శ్రీకారం చుట్టారు. హనుమంతపుర సమీపాన సోమవారం ఏర్పాటైన కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొని ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నట్లుగా ఖజానా ఖాళీ కాలేదని అందుకు తమ ప్రభుత్వం లక్ష కోట్ల రూపాయలతో చేపట్టిన అభివృద్ధి పనులే నిదర్శనమని సీఎం అన్నారు. జిల్లాలో హైటెక్ పట్టుగూళ్ల మార్కెట్, హెచ్ఎన్ వ్యాలి 3వ దశతో 164 చెరువులకు నీరు నింపడం, వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన, పలు పథకాల ప్రారంభం, లబ్ధిదారులకు సౌలభ్యాలు పంపిణీ చేస్తున్నామన్నారు. హైటెక్ పట్టుగూళ్ల మార్కెట్‌తో రాష్ట్రంలోని పట్టురైతులకు ఎంతో ఉపయోగం కానుందన్నారు. శిడ్లఘట్ట నియోజకవర్గంలో భారీ ప్రమాణంలో పనులకు శ్రీకారం చుట్టడం ప్రభుత్వం అభివృద్ధి పర్వ వేగాన్ని చూపుతోందన్నారు. ఇచ్చిన మాట ప్రకారం అమలు చేస్తున్నామన్నారు. ప్రభుత్వం వద్ద డబ్బు లేదు, ఖజానా ఖాళీ అయ్యిందనే బీజేపీ ఆరోపణలకు తమ ప్రభుత్వం బదులిస్తోందన్నారు. తమ ప్రభుత్వ అవధిలో ఏ గ్యారెంటీ పథకాన్ని ఆపేది లేదన్నారు. రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి ప్రతి నెలా ప్రభుత్వం నుంచి నగదు, పథకం ప్రయోజనాలు అందుతున్నాయన్నారు. అంతేకాకుండా చిన్న నీటి పారుదల, నగరాభివృద్ధి, గ్రామీణాభివృద్ధికోసం వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసి అభివృద్ధి చేస్తున్నామని గణాంకాలు ప్రస్తావించారు.

శిడ్లఘట్టకు మినీ విధానసౌధ

నియోజకవర్గ కేంద్రమైన శిడ్లఘట్టకు మినీ విధానసౌధ అవసరం ఉందని జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి డాక్టర్ ఎంసీ సుధాకర్, నియోజకవర్గ ఎమ్మెల్యే రవికుమార్ తమముందు డిమాండ్ ఉంచారని, వాటిని పరిష్కరిస్తామని సీఎం భరోసా ఇచ్చారు. సమాజంలోని ప్రతి ఒక్కరికీ ఆర్థికశక్తి రావాలని, కుల, వర్ణ వ్యవస్థ పోవాలని సమసమాజం నెలకొనాలని అప్పుడు స్వాతంత్ర్యానికి సార్థకత సాధ్యమన్నారు. ఇలా తమ ప్రభుత్వం అన్నికులాలు, మతాల పేదలకు సంక్షేమాలు అమలు చేస్తోందని తమది ప్రజాసంక్షేమ ప్రభుత్వమన్నారు. బీజేపీకి రాష్ట్రప్రజలు అధికారం ఇవ్వగా అభివృద్ధి పనులు చేయలేదన్నారు. కనీసం ఒక్క ఇంటిని కూడా బీజేపీ తన పాలనలో పంపిణీ చేయలేదన్నారు. ప్రస్తుతం తమ ప్రభుత్వం ప్రజల ఇంటి ముంగిటకే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నామన్నారు. దీన్ని సహించలేక బీజేపీ తప్పుడు ఆరోపణలు చేస్తోందన్నారు. 2028లో కూడా కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీఎంకు గొర్రెను అందచేసి ఆత్మీయంగా సత్కరించారు. కార్యక్రమంలో డీసీఎం డీకే శివకుమార్, మంత్రి డాక్టర్ ఎంసీ సుధాకర్, పౌర ఆహార సరఫరాల శాఖ మంత్రి కేహెచ్ మునియప్ప, మంత్రులు హెచ్‌సీ మహదేవప్ప, కృష్ణబైరేగౌడ, దినేశ్ గుండూరావు, బోసరాజు, లక్ష్మీహెబ్బాళ్కర్, జమీర్ అహ్మద్‌ఖాన్, బైరతి సురేశ్, రహీంఖాన్, కోలారు ఎంపీ మల్లేశ్‌బాబు, ఎమ్మెల్యే రవికుమార్, బాగేపల్లి ఎమ్మెల్యే సుబ్బారెడ్డి, చిక్కబళ్ళాపుర ఎమ్మెల్యే ప్రదీప్ ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.



భూమిపూజలో పాల్గొన్న సీఎం సిద్దరామయ్య

కేంద్రమంత్రి కుమారతో విజయేంద్ర భేటీ | పారా స్విమ్మింగ్‌లో విద్యార్థికి బంగారు పతకం | చిరుత సంచారంపై ఆందోళన | సంబరంగా కన్నడ రాజ్యోత్సవం | వివరాలు 7లో


కమలాపురం చెరువులో రెగ్యులర్ బోటింగ్

- అధికారుల నిర్ణయంపై పర్యాటకుల హర్షం



విహారానికి సిద్ధం చేసిన బ్యాటరీ బోట్

బళ్లారి గాంధీనగర్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): చారిత్రక ప్రసిద్ధి గాంచిన హంపికి వెళ్ళే దారిలో విజయనగర రాజులు నిర్మించిన అందమైన ప్రాంతం కమలాపురం చెరువు. హంపికి వెళ్లే పర్యాటకులు ఎవరైనా ఇక్కడి ప్రకృతి అందాలు చూడకుండా వెళ్లరు. ఇకపై ఇక్కడ నిత్యం బోటింగ్ ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు ప్రకటించారు. డిసెంబర్ 6వ తేదీ నుంచి ఈ సౌకర్యం అందుబాటులోకి రానుంది. ఉత్తర కన్నడ జిల్లా హొన్నావరద సురేష్ నాయక్ అనే వ్యక్తి బోట్ విహారం ప్రారంభించేందుకు ఆసక్తి చూపిన నేపథ్యంలో హంపిలో నిప్రపంచ పర్యాటక నిర్వహణ ప్రాధికార అందుకు అనుమతి ఇచ్చింది. సోలార్ బ్యాటరీ ఆధారంగా నడిచి బోట్‌లో 8 మంది కూర్చేనేందుకు, 16 ఆసనాలు కలిగిన మరో బోట్‌లో కమలాపురం చెరువు అందాలను వీక్షించేందుకు అవకాశం కల్పించనుంది. కారవార ప్రాంతాల్లో ఇప్పటికే ఇదే తరహాలో పర్యాటకులకు బోటింగ్ వ్యవస్థను కల్పించారు. నాలుగైదు రోజుల్లోగా కమలాపరం చెరువు సమీపానికి ఈ బోట్లు వచ్చే అవకాశం ఉంది. ఈ బోట్లు సౌరవిద్యుత్ కలిగి ఉంటాయి. సౌరశక్తి నడిచే బ్యాటరీలు వీటికి అమరుస్తారు. జలవిహారం నూతన నిబంధనల ప్రకారం పెట్రోల్, డీజిల్ ఆధారిత బోట్లు నడిపే అనుమతి లేని తరుణంలో సౌరశక్తితో చార్జింగ్ ఆధారిత బ్యాటరీలు ఉపయోగించి బోట్లు నడుపుతారు. ప్రస్తుతం రెండు బోట్‌లు రెగ్యులర్‌గా సేవలు అందించేందుకు ఏర్పాట్లు చేశారు. చెరువు గట్టుపై ఉన్న దేవస్థానం వద్ద అందుకు అవసరమైన ఏర్పాట్లు చేశారు. చెరువు మధ్యభాగంలో కిట్టి పార్టీ ఏర్పాటుకు అనుకూలం అయ్యేలా తేలియాడే వేదిక నిర్మించనున్నారు. పర్యాటకులు స్పందన ఆధారంగా భవిష్యత్‌లో బోట్‌ల సంఖ్య పెంచే అవకాశం ఉన్నట్లు పర్యాటక శాఖ కమిషనర్ రమేష్ వటగల్ తెలిపారు.



హంపి సమీపంలోని కమలాపురం చెరువు



రోడ్డుపై ధాన్యం ఆరబోసిన రైతులు

ఎవరి కోసం..?

- వరి కొనుగోలు కేంద్రాలపై నిరాసక్తత
- అర్థం లేని నిబంధనలతో వేధిస్తున్నారని ఆవేదన
- మద్దతు ధర గిట్టుబాటు కాదంటున్న అన్నదాత
- మిల్లర్లు, వ్యాపారులకే అమ్ముకుంటున్న రైతులు

బళ్లారి, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): వరి రైతులు పంట అమ్ముకోలేక విలవిలలాడుతున్నారు. మద్దతు ధరతో పంట కొంటామని ప్రభుత్వం ప్రకటించింది. ఏ ఒక్క రైతూ దళారీ చేతిలో మోసపోకూడదు అని ప్రభుత్వం వరి, రాగి, జొన్న కొనుగోళ్ల కేంద్రాలను ఏర్పాటు చేసింది. అయితే ఇక్కడ నిబంధనలు రైతులకు చుక్కలు చూపిస్తున్నాయి. దీంతో కొనుగోలు కేంద్రాలకు వెళ్లాలంటేనే రైతులు బెంబేలెత్తుతున్నారు. ఎంతో కొంత రాగి. జొన్నలు మాత్రం రైతులు ప్రభుత్వ కేంద్రాల్లో అమ్ముకుంటున్నారు. కానీ వరి ధాన్యం అమ్ముకునేందుకు వెనకడుగు వేస్తున్నారు. బళ్లారి, రాయచూరు, కొప్పళ, జిల్లాల్లో తుంగభద్ర జలాల కింద ఖరీఫ్‌లో అధికంగా ధాన్యం సాగు చేశారు. ఆ పంట ఇప్పుడు కోతకు వచ్చాయి. ప్రభుత్వం 2025-26 ఏడాదిలో ఖరీఫ్‌లో పండించిన వరిధాన్యం క్వింటాల్‌కు మద్దతు క్వింటాల్‌కు ధర రూ. 2,369 ఇందులో ఏగ్రేడ్ రకం అయితే రూ. 2,389 ప్రకటించింది. రాష్ట్ర వ్యాప్తరంగా ఆహార మరియు పౌర సరఫరాల కార్పొరేషన్ సంస్థ కోనుగోళ్ల ప్రక్రియ ప్రారంభించింది. ప్రతి రైతు నుంచి 25 క్వింటాళ్ల నుంచి 50 క్వింటాళ్ల ధాన్యం కొనుగోళ్లు చేయాలని నిర్ణయించింది. కొనుగోళ్ల కేంద్రంలో రైతు భూమి ఎంత ఉంది. అందుకు పాన్, ఆధార్ కార్డు, బ్యాంక్ అకౌంట్ నంబర్, ఇలా పూర్తీ వివరాలు ఉంటేనే కొనుగోలు చేస్తారు. ఇక్కడే కౌలు రైతులు కష్టాలు చవి చూడాల్సి వస్తోంది. భూమి వివరాలు, అసలు భూమి యజమాని పేరుతో ఉంటాయి. కౌలు రైతులకు ఆధారాలు లేకపోవడంతో అధికారులు కొనుగోలు చేయడం లేదు. అదీకాకం ప్రభుత్వ ధర కంటే మిల్లర్లు అధికంగానే చెల్లిస్తున్నారు. పైగా ధాన్యాన్ని రైతులే సంచుల్లో నింపుకుని కొనుగోలు కేంద్రాల వద్దకు తరలించాలి. అదే మిల్లరు, బయటి వ్యాపారులు అయితే రైతుల వద్దకే వచ్చి కొనుగోలు చేస్తున్నారు. పైగా ప్రభుత్వం కేంద్రాల్లో ధాన్యం విక్రయిస్తే డబ్బులు ఏ ఆరు మాసాలకో వస్తాయి అని రైతులు అంటున్నారు. ఇలా ప్రభుత్వం సవాలక్ష నిబంధనలతో కొనుగోలు కేంద్రాల వద్దకు వెళ్లడానికి ఆసక్తి చూపడం లేదు. కొందరి రైతులకు గోనెసంచుల కొరత కూడా తీవ్రంగా వేధిస్తోంది. బళ్లారి జిల్లాలో సిరుగుప్ప, కంప్లి, బళ్లారి, విజయనగర జిల్లాలో విజయనగర, హగరి బొమ్మనహళ్, కొప్పళ జిల్లాలో గంగావతి, కొప్పళ, రాయచూరు జిల్లాలో సింధనూరు. గాంధీనగర్ ఇలా వరిధాన్యం ఎక్కువ పండించే ఏరియాల్లో కొనగోళ్ల కేంద్రాలు నెలకొల్పారు. ఇక రాగి, జొన్న కేంద్రాలు కూడా నెలకొల్పాడు. అయినా వరి కొనుగోలు కేంద్రాలపై (మిగతా 8వ పేజీలో)



మూటల్లో నింపి మిల్లుకు తరలిస్తున్న రైతులు

సత్యసాయి వేడుకలు సక్సెస్

భక్తుల్లో హర్షాతిరేకాలు



వేడుకలలో చివరి రోజు రాత్రి హిల్ వ్యూ స్టేడియంలో సత్యసాయికి మహా మంగళహారతి

పుట్టపర్తి/టౌన్ నవంబరు 24(ఆంధ్రజ్యోతి): సత్యసాయిబాబా శతజయంతి వేడుకలు విజయవంతంగా ముగియడంపై సర్వత్రా హర్షం వ్యక్తం అవుతోంది. ట్రస్టుతో కలిసి రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న శ్రద్ధ వల్లే వేడుకలు ఘనంగా జరిగినట్లు భక్తులు పేర్కొన్నారు. ఉత్సవాలను విజయవంతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం నెల రోజులు ముందుగానే మంత్రులతో కమిటీ ని ఏర్పాటు చేసింది. పట్టణంలో అవసరమైన సౌకర్యాల కల్పన, సుందరీకరణకు రూ.20కోట్లు మంజూరు చేసింది. స్థానిక ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని ముందస్తు ఏర్పాట్లపై తరచూ సమావేశాలు సమీక్షలు నిర్వహించారు. ఈనేపథ్యంలో ఉత్సవాల ప్రారంభం నుంచి రాష్ట్రం, దేశవిదేశాల నుంచి భక్తులు వేలాదిగా తరలివచ్చి, సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు. ఈక్రమంలోనే రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి, ప్రధాని, మన రాష్ట్రంతో పాటు వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు, మంత్రులు, అధికారులు పుట్టపర్తికి తరలివచ్చి జయంతి వేడుకల్లో పాల్గొన్నారు.

ముగిసిన నారాయణ సేవ

సత్యసాయి శతజయంతి వేడుకల్లో పాల్గొన్న లక్షల మంది భక్తులకు సత్యసాయి సెంట్రల్ ట్రస్టు ఆధ్వర్యంలో నారాయణ సేవ పేరిట అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈనెల 13 నుంచి 12రోజులు నిరంతరాయంగా నారాయణ సేవ కొనసాగించారు. ఆఖరిరోజు సోమవారం రాత్రి భక్తులకు నారాయణ సేవ అందించి ముగించారు. నారాయణ సేవను దాదాపు 5 వేల మంది అందించారు. ముఖ్యంగా అన్నమయ్య జిల్లా పాడేరు, శ్రీకాకుళం ప్రాంతానికి చెందిన ఎక్కువ మంది సేవాదళ్‌లో పాల్గొన్నారు. వీరుగాక తెలంగాణ, కర్ణాటక, తమిళనాడుతో పాటు చాలా మంది భక్తులకు తమ వంతు సాయం చేశారు. ప్రశాంతి నిలయం విద్యాసంస్థలు లేజర్‌షో, డ్రోన్లతో ఫొటోలు, సాంస్కృతిక కార్యక్రమాలు వంటివి భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి.



సత్యసాయిని ధ్యానిస్తున్న నటి సాయి పల్లవి.. భక్తుల తన్మయత్వం



పుట్టపర్తి హిల్ వ్యూ స్టేడియంలో శత జయంతి వేడుకలలో భక్తి గీతాలను ఆలపించి అలరించిన భారతీయ, విదేశీ గాయకులు









సత్యసాయికి పాశ్చాత్య భక్తుల సంగీత నివేదన

జిల్లా యంత్రాంగం సమష్టి కృషి వల్లే..

జిల్లా యంత్రాంగం సమష్టి కృషి ఫలితంగానే సత్యసాయిబాబా శతజయంతి ఉత్సవాలు విజయవంతం అయ్యాయని కలెక్టర్ శ్యాంప్రసాద్ పేర్కొన్నారు. ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించిన నేపథ్యంలో సోమవారం రాత్రి స్థానిక సాయిఆరామంలో జిల్లా అధికారులతో కలెక్టర్, ఎస్పీ సతీష్ కుమార్, సంయుక్త అధ్యక్షతన సక్సెస్‌మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమాల నిర్వహణ, భద్రతా ఏర్పాట్లు, ట్రాఫిక్ నియంత్రణ, ప్రజా సౌకర్యాలు, స్వచ్ఛత, వైద్యసేవలు తదితర విభాగాలలో అధికారుల పనితీరును ప్రశంసించారు. శతజయంతి ఉత్సవాలు రాష్ట్ర స్థాయిలోనేగాక జాతీయ స్థాయిలో ప్రత్యేక గుర్తింపు పొందేలా ప్రతి శాఖ సమన్వయంతో అద్భుతంగా నిర్వహించిందని కలెక్టర్ అభినందించారు. లక్షలాదిగా పాల్గొన్న భక్తులకు 5వేల మంది సిబ్బందితో భద్రతా ఏర్పాట్లు చేసినట్లు ఎస్పీ పేర్కొన్నారు. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ఇక్కడ పనిచేయడం అదృష్టంగా భావిస్తున్నానని, ఒక మంచి కార్యక్రమంలో జిల్లాస్థాయి అధికారులు అందరూ పాల్గొని ఉల్లాసంగా గడపడం చాలా సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి డీఆర్వో సూర్యనారాయణరెడ్డి, ఆర్డీఓలు సువర్ణ, వీవీఎస్.శర్మ, మహేష్, ఆనందకుమార్, డీఎఫ్ఓ చక్రపాణి, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, విద్యుత్ శాఖ ఎస్ఈ సంపత్ కుమార్, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్, ఫొటోలో ఎస్పీ, జేసీ

విజేతలు వీరే..!

● సత్యసాయి శతజయంతి సందర్భంగా వ్యాసరచన పోటీల నిర్వహణ



బహుమతులు పొందిన విద్యార్థులు

పుట్టపర్తి, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): సత్యసాయిబాబా శతజయంతి వేడుకల సందర్భంగా నిర్వహించిన పోటీల్లో విజేతలకు సోమవారం బహుమతులు ప్రదానం చేశారు. ఉత్సవాలను పురస్కరించుకుని రాష్ట్రవ్యాప్తంగా వ్యాసరచన పోటీలను మూడు విభిన్న స్థాయిలలో నిర్వహించారు. హైస్కూలు స్థాయిలో విద్యార్థులకు (డ్యూటీ ఈజ్ గాడ్), ఇంటర్‌కు(టుమారో ఫ్యూచర్ డిపెండ్స్ ఆన్ వాట్ వుయ్ డు టుడే), డిగ్రీ స్థాయిలో(ట్రాన్స్‌ఫార్మ్ యువర్ సెల్ఫ్ టు ట్రాన్స్‌ఫార్మ్ ది వరల్డ్) వ్యాసరచన పోటీలు నిర్వహించారు. మొత్తం 4,182 విద్యాసంస్థలకు గాను 1,73,030 మంది విద్యార్థులు ఈ పోటీలో పాల్గొన్నారు. వీరిలో 3,360 పాఠశాలల నుంచి 1,32,136 మంది, 566 జూనియర్ కళాశాలల నుంచి 25,684 మంది, 256 డిగ్రీ కళాశాలల నుంచి 15,210 మంది విద్యార్థులు పాల్గొన్నారు. జిల్లా స్థాయి పోటీలు పూర్తయిన తర్వాత రాష్ట్ర స్థాయిలో తెలుగుతో పాటు ఆంగ్ల మాధ్యమంలో ప్రతిభ చూపి, విజేతలైన ఆరుగురికి రాష్ట్రస్థాయి బంగారు పతకం అందజేశారు. సాయికుల్వంత్ హాలులో ఆంధ్రప్రదేశ్ శ్రీ సత్యసాయి సేవా సంస్థల రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణరావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. హిమవాహ్ని రత్నాకర్, కమలా పండ్యా (జాతీయ విద్యా విభాగ సమన్వయకర్త), డాక్టర్ ఎల్.శశిబాల (జాతీయ సేవా విభాగ సమన్వయకర్త-మహిళ) నీతా ఖన్నా(జాతీయ ఆధ్యాత్మిక విభాగ సమన్వయకర్త-మహిళ) చేతుల మీదుగా విజేతలకు బంగారు పతకాలను అందజేశారు.

కృత్రిమ పరికరాల కోసం దరఖాస్తు చేసుకోండి

అనంతపురం టౌన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులు కృత్రిమ పరికరాల కోసం దరఖాస్తు చేసుకోవాలని భారత్ వికాస్ పరిషత్ ప్రతినిధి పరుచూరు రమేష్‌బాబు సోమవారం ఓ ప్రకటనలో కోరారు. కృత్రిమ కాళ్లు, చేతులు, కాలిపర్స్ వంటివి సంస్థ ఆధ్వర్యంలో ఉచితంగా అందజేస్తామన్నారు. ప్రతిఏటా తమ పరిషత్ ఆధ్వర్యంలో జైపూర్ కాలు కంటే నాణ్యమైన కృత్రిమ కాళ్లు, చేతులు, కాలిపర్స్ ఉచితంగా అందజేస్తున్నట్లు తెలిపారు. అర్హత గల దివ్యాంగులు డిసెంబరు 13 లోపు 98495 08904 నంబర్‌ను సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

రోడ్డు ప్రమాదంలో వీఆర్‌ఏ మృతి

గార్లదిన్నె, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మర్తాడు హెచ్చెల్సీ వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎర్రగుంట్ల వీఆర్‌ఏ వెంకటరాముడు(50) మృతి చెందాడు. సంజీపురం గ్రామానికి చెందిన వెంకటరాముడు ఎర్రగుంట్ల వీఆర్‌ఏగా పనిచేస్తున్నాడు. ఈక్రమంలోనే తహసీల్దార్ కార్యాలయంలో విధులు ముగించుకుని తమ గ్రామానికే చెందిన ఈశ్వర్ ద్విచక్ర వాహనంపై వీఆర్‌ఏ వెంకటరాముడు బయల్దేరాడు. అయితే మర్తాడు హెచ్చెల్సీ వద్ద ద్విచక్రవానం అదుపు తప్పడంతో ఇద్దరూ కింద పడ్డారు. తీవ్రంగా గాయపడిన వీఆర్‌ఏ వెంకటరాముడును 108 వాహనంలో అనంతపురం ప్రభుత్వం ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు మృతి చెందినట్లుగా నిర్ధారించారు. మృతుడికి ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ఈశ్వర్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. గార్లదిన్నె పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బ్రిడ్జి నుంచి పడి గుర్తుతెలియని వ్యక్తి..



మృతి చెందిన వ్యక్తి

అనంతపురం క్రైం, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): నగరంలోని క్లాక్ టవర్ రైల్వే ఓవర్ బ్రిడ్జి నుంచి పడి ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. సోమవారం ఉదయం 7 గంటల సమయంలో బ్రిడ్జి పైనుంచి కింద ఉన్న రెండో రోడ్డు వైపునకు పడిపోవడంతో తీవ్ర గాయాలై మృతి చెందాడు. ఆత్మహత్య చేసుకుందామని అతడే దూకాడా...లేక ఉన్నఫలంగా కింద పడిపోయాడా అన్న విషయం తెలియాల్సి ఉంది. 3వ పట్టణ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి వివరాలను ఆరా తీస్తున్నారు. మృతుడి వివరాలు తెలిసిన వారు త్రీటౌన్ సీఐ 9490618679, ఎస్ఐలు: 934691715, 9963346769 నెంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు.

ఆసుపత్రిలో భాగం కోసమే దాడి

● అడ్వొకేట్ సత్యనారాయణరెడ్డి సహా ఏడుగురి అరెస్ట్

● టూ టౌన్ సీఐ శ్రీకాంత్ యాదవ్ వెల్లడి



అరెస్టు చేసిన వారిని చూపుతున్న టూ టౌన్ సీఐ

అనంతపురం క్రైం, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): షేర్ కోసమే శ్రీనివాస మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిపై అడ్వొకేట్ సత్యనారాయణరెడ్డి తన అనుచరులతో దాడులు చేశారని టూ టౌన్ సీఐ శ్రీకాంత్ యాదవ్ పేర్కొన్నారు. రెంటల్ పార్ట్‌నర్‌గా ఉన్న సత్యనారాయణరెడ్డి దురుద్దేశ పూర్వకంగానే ఆసుపత్రిపై దాడి చేశారని ఆయన స్పష్టం చేశారు. దాడికి దిగిన దుండగులను సోమవారం టూ టౌన్ సీఐ అరెస్టు చేశారు. కేసు నమోదు చేసి సత్యనారాయణరెడ్డితోపాటు మరో ఆరుగురిని అరెస్టు చూపించారు. సీఐ తెలిపిన వివరాల మేరకు.. 2020లో పాత పావనీ ఆసుపత్రిని గుత్తా పావని నుంచి శ్రీనివాసరావు, మొగిలి సత్యనారాయణరెడ్డి, రాఘవేంద్ర, శ్రీలత కొనుగోలు చేశారు. శ్రీనిలయం పేరు మీద రిజిస్ట్రేషన్ చేసుకుని, అనంతరం శ్రీనివాస మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి ఏర్పాటుకు 10 ఏళ్ల లీజ్‌కు ఇచ్చారు. శ్రీనివాస మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి ఓనర్లుగా శ్రీనివాసరావు, రాఘవేంద్ర ఆసుపత్రిని అధునికీకరించుకుంటున్నారు. కేవలం రెంటల్ పార్ట్‌నర్‌గా ఉన్న సత్యనారాయణరెడ్డి ఆసుపత్రిలో షేర్ కావాలని అడిగాడు. వాళ్లు అందుకు అంగీకరించకపోవడంతో తన అనుచరులతో మారణాయుధాలతో ఆసుపత్రిపై దాడికి దిగాడు. దుండగులపై కేసు నమోదుచేశారు. నిందితులను ప్రసన్నాయపల్లి గేటు వద్ద అరెస్టు చేశారు. జనశక్తినగర్‌కు చెందిన అడ్వొకేట్ మొగిలి సత్యనారాయణరెడ్డి(45), ఎల్‌బీ కాలనీకి చెందిన సాయినాథ్‌రెడ్డి(46), దాసంపల్లి బీసీ కాలనీకి చెందిన బోయ సీతారాములు(23), దాసంపల్లికి చెందిన యువరాజ్(20), కళ్యాణదుర్గం మండలం నారాయణపురానికి చెందిన చంద్రశేఖర్(21), ఆజాద్‌నగర్‌కు చెందిన షాషావలి(26), విడపనకల్లుకు చెందిన నవీన్(25)ను అరెస్టు చేశారు. వారి నుంచి 3 కార్లు, మోటర్ సైకిల్, మూడు సుత్తులు, రెండు మచ్చుకత్తులు, రెండు చెట్ల అడ్డాలు, రెండు కట్టెలు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వారిని కోర్టులో ప్రవేశపెట్టి.. న్యాయాధికారి ఆదేశాలతో రెడ్డిపల్లి జైలుకు తరలించారు.

టమోటా కిలో రూ.51

అనంతపురం రూరల్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి టమోటా మార్కెట్లో సోమవారం టమోటాలు కిలో గరిష్ఠంగా రూ.51తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రూప్‌కుమార్ తెలిపారు. అదే విధంగా కనిష్ఠంగా రూ.30తో, సరసరిగా రూ.37తో విక్రయాలు జరిగాయన్నారు. మార్కెట్‌కు 1950 టన్నుల టమోటాలు వచ్చినట్లు పేర్కొన్నారు.

చీనీ టన్ను రూ.19వేలు

అనంతపురం రూరల్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): అనంత వ్యవసాయ మార్కెట్లో సోమవారం సీజనల్ చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.19,200తో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి, మార్కెటింగ్ శాఖ ఏడీ రాఘవేంద్రకుమార్ తెలిపారు. అలాగే కనిష్ఠంగా రూ.10వేలు, సరాసరి ధర రూ.15వేలు పలికాయన్నారు. మార్కెట్‌కు మొత్తంగా 20 టన్నుల చీనీకాయలు వచ్చినట్లు చెప్పారు.

30లోపు పది పరీక్ష ఫీజు చెల్లించండి

● జిల్లా విద్యాశాఖ ఏడీ లాజర్

కొత్తచెరువు/అనంతపురం విద్య, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలో చదువుతున్న పదో తరగతి విద్యార్థులు ఈనెల 30వరకు పబ్లిక్ పరీక్షా ఫీజును చెల్లించవచ్చని శ్రీసత్యసాయి జిల్లా విద్యాశాఖ ఏడీ లాజర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షా ఫీజు చెల్లించే సమయంలో విద్యార్థి వివరాలు, మీడియం తప్పులు లేకుండా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. అపార్ ఐడీ పూర్తికానీ విద్యార్థులు ఆధార్, అడ్మిషన్ రిజిస్టర్ ద్వారా తల్లిదండ్రుల అనుమతి పత్రంతో వివరాలను ఆన్‌లైన్‌లో సరిచేసుకోవాలన్నారు. ఒకేషనల్ ట్రేడ్ ఉన్న పాఠశాలల్లో టీచర్లు లేకపోతే ఆ విద్యార్థులు డీఈఓ దృష్టికి సమాచారం తీసుకువస్తే రాష్ట్ర ప్రభుత్వ పరీక్షా విభాగం అధికారులకు తెలియజేస్తామన్నారు. దీంతో ఒకేషనల్ ట్రేడును తొలగించి జనరల్‌గా పరీక్షలు రాయడానికి అవకాశం కల్పిస్తారన్నారు. వివరాల కోసం 7032861795, 9491100431 నంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు.

సమస్యల పరిష్కారానికి ప్రత్యేక సెల్

పదో తరగతి పబ్లిక్ పరీక్షలతో పాటు ఓపెన్ పరీక్షల ఫీజు చెల్లింపులో ఏర్పడుతున్న సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక సెల్ ఏర్పాటు చేసినట్లు అనంతపురం డీఈఓ ప్రసాద్‌బాబు తెలిపారు. ఇప్పటికే ఈపరీక్షలకు సంబంధించిన షెడ్యూల్ ప్రకటించినట్లు తెలిపారు. అన్ని యాజమాన్యాల ఉన్నతపాఠశాలల ప్రధానోపాధ్యాయులు యుడైస్ పోర్టల్‌లో విద్యార్థి వివరాలు ధ్రువీకరించడానికి వెబ్‌సైట్‌లోని పాఠశాల లాగిన్ ద్వారా అప్లికేషన్ డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. ఆ తర్వాత పరీక్ష రుసుం చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఇందులో ఎదురయ్యే సమస్యల పరిష్కారం కోసం జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో ఏసీ వెంకటేష్, సూపరింటెండెంట్ లక్ష్మీనారాయణ, ఏఎస్ఓ శ్రీనివాసులు, జూనియర్ అసిస్టెంట్ నాగరాజులతో ప్రత్యేక సెల్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 970222436, 8886555174,9440839419,9182115437 ఫోన్‌నంబర్లలో సంప్రదించవచ్చన్నారు.

జిల్లా క్రికెట్ సంఘం ఏకగ్రీవం..!

ఆరు పదవులకు.. ఆరు నామినేషన్లు



నామినేషన్లు స్వీకరిస్తున్న ఎన్నికల అధికారి ఈశ్వర్

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): జిల్లా క్రికెట్ సంఘం పాలక వర్గం ఎన్నిక ఏకగ్రీవమయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఇటీవల జిల్లా క్రికెట్ క్రీడాకారుల ఎంపికలో చోటు చేసుకున్న అవకతవకల నేపథ్యంలో జిల్లా క్రికెట్ సంఘం ఎన్నికలకు ప్రాధాన్యం సంతరించుకుంది. జిల్లా క్రికెట్ సంఘం అండతో క్రీడాకారుల ఎంపికలో అక్రమాలకు సహకరించినట్లు పెద్ద చర్చ సాగింది. ఈ క్రమంలో జిల్లా క్రికెట్ సంఘం ఎన్నికలకు నోటిఫికేషన్ ఇచ్చారు. ఇదివరకు పనిచేసిన పాలకవర్గ సభ్యులు తప్పుకుని... కొత్త వాళ్లకు అవకాశం కల్పించాలని నిర్ణయించినట్లు సమాచారం. గతంలో జిల్లా క్రికెట్ సంఘంలో పనిచేసిన వ్యక్తులు తిరిగి తమకు పదవులు కావాలని పట్టుబట్టినట్లు తెలుస్తోంది. ఇందులో జిల్లాలో నివాసం లేని వ్యక్తులు పదవుల కోసం తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. అధ్యక్ష పదవి కోసం హైదరాబాద్‌లో ఉండే వ్యక్తి తరఫున సోమవారం నామినేషన్ వేశారు. ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ కోచ్‌గా ఉన్న వ్యక్తి కార్యదర్శి పదవికి నామినేషన్ వేయగా.. స్థానికేతరుడుగా ఉన్న వ్యక్తి ఉపాధ్యక్ష పదవికి, గతంలో సంఘంలో పనిచేసి క్రికెట్‌తో సంబంధం లేని, సెలెక్షన్స్ అవకతవకల్లో పేరు ఉన్న వ్యక్తి కోశాధికారి పదవికి, సహాయ కార్యదర్శి పదవికి క్రికెట్ ప్లేయర్, కౌన్సిలర్‌కు క్రికెట్‌కు సేవ చేయని వ్యక్తి నామినేషన్లు వేశారు. ఆరు పదవులకు ఆరుగురే నామినేషన్లు వేయడంపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఎన్నికల అధికారి, విశ్రాంత ఆర్డీఓ ఈశ్వర్ పర్యవేక్షణలో జిల్లా క్రికెట్ సంఘం సర్వసభ్య సమావేశం, ఎన్నికలు జరగనున్నాయి. సోమవారం నామినేషన్లు వేసిన అభ్యర్థుల వివరాలు ఇలా ఉన్నాయి.. అధ్యక్షుడు-సి శ్రీనాథ్, కార్యదర్శి-ఎ.యుగంధర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు- నూర్ మహ్మద్‌ఖాన్, సహాయ కార్యదర్శి- ఎన్. సర్దార్, కోశాధికారి- జె.మురళీకృష్ణ, కౌన్సిలర్-హెచ్.అన్సార్‌ఖాన్ ఉన్నారు. ఆరు పదవులకు ఆరుగురే నామినేషన్లు వేయడంతో ఈనెల 29వతేదీ సర్వసభ్య సమావేశం, ఏకగ్రీవ ప్రకటన లాంఛనమేనని తెలుస్తోంది. 2025-28 సంవత్సరానికి నూతన కార్యవర్గం పదవీ కాలం కొనసాగనుంది.

బాల బాలికల క్రికెట్ జట్ల ఎంపిక

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఎస్‌జీఎఫ్ జిల్లా అండర్-17 బాల, బాలికల క్రికెట్ జట్లను ఎంపిక చేశారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ఆర్డీటీ స్టేడియంలో ఎస్‌జీఎఫ్ అండర్-17 జిల్లా బాల, బాలికల క్రికెట్ జట్ల ఎంపిక పోటీలు నిర్వహించారు. ఎంపికైన జట్ల వివరాలను ఎస్‌జీఎఫ్ బాలుర సెక్రటరీలు శ్రీనివాసులు, లక్ష్మీనారాయణ, బాలికల సెక్రటరీలు శకుంతల, సుహాసిని ప్రకటించారు. ఎంపికైన జట్లు రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్ క్రికెట్ పోటీల్లో పాల్గొంటాయన్నారు. కార్యక్రమంలో పీడీలు సునీల్, శరణ్, వేణు, గౌసియా, ఆనంద్, వెంకటేశులు, యమున, శ్యామల, చామంతి, లీలారాణి, కోచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

● బాలికల జట్టుకు పూర్ణచంద్రిక, తరుణిక, చక్రిక, హిమవర్షిణి, లక్ష్మోహన్, ఛాయశ్రీ, అక్షర, బృంద, సంజన, జస్మిక, మహ్మదీ, శ్రావణి, గోపి చందన, కాత్యాయని, శృతి కీర్తన, సమత ఎంపికయ్యారు.

● బాలుర జట్టుకు జయప్రకాష్, రంజిత్‌కుమార్, పునీతేశ్వర్, గోవర్ధన్, కౌశిక్, సీతారామ్, తన్మయికృష్ణ, వర్ల జయదీప్, వెంకటసాయి, వెంకటసాయి, సంతోష్, కార్తీక్, మహ్మద్ సాబీర్, తరుణ్ కుమార్ రెడ్డి, మనోజ్, లిఖిత్, మహేంద్ర ఎంపికయ్యారు.

స్పిన్ ఉచ్చులో ఒడిశా

● 126 పరుగులకే కుప్పకూలిన వైనం

● కూచ్ బెహార్ అండర్-19 క్రికెట్ టోర్నీలో ఆంధ్ర పట్టు

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర బౌలర్లు లోహిత్, కార్తీక్‌రెడ్డి స్పిన్ మాయాజాలానికి ఒడిశా జట్టు 126 పరుగులకే కుప్పకూలింది. చెరో నాలుగు వికెట్లతో చెలరేగడంతో స్వల్ప స్కోరుకే చాప చుట్టేసింది. కూచ్ బెహార్ అండర్-19 క్రికెట్ టోర్నీలో భాగంగా అనంతపురం ఆర్డీటీ స్టేడియంలో ఆంధ్ర-ఒడిశా జట్ల మధ్య మ్యాచ్ రెండోరోజు సోమవారం కొనసాగింది. ఆంధ్ర జట్టు ఓవర్‌నైట్ స్కోర్ 246-7తో రెండో రోజు ఆట ఆరంభించింది. కేవలం 36పరుగులు జోడించి మిగిలిన 3వికెట్లు కోల్పోయింది. ఆంధ్ర జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 94.4ఓవర్లలో 282 పరుగులు సాధించింది. ఇందులో ఏఎన్‌వీ లోహిత్ 71పరుగులు సాధించాడు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ఆరంభించిన ఒడిశా 63.1ఓవర్లలో 124పరుగులకు ఆలౌట్ అయ్యింది. బ్యాటర్లు సుభాసిస్ మల్లిక్ 40, ప్రశాంత్ మోక్షిత్ 35పరుగులు చేశారు. ఆంధ్ర బౌలర్లు ఏఎన్‌వీ లోహిత్, కార్తీక్‌రెడ్డి తమ స్పిన్ మాయాజాలంతో ఒడిశా నడ్డివిరిచారు. రెండో ఇన్నింగ్స్ ఆరంభించిన ఆంధ్రజట్టు రెండోరోజు ఆటముగిసే సమయానికి 15ఓవర్లలో 2వికెట్ల నష్టానికి 46పరుగులు సాధించింది. బీసీసీఐ రెఫరీ వరుణ్‌కుమార్, అంపైర్లు జై సంఘని, సబిసాచి సర్కార్‌లు మ్యాచ్‌ను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి భీమలింగారెడ్డి, కమలాకర్ నాయుడు, సభ్యులు పాల్గొన్నారు.



ఒడిశా బ్యాటర్లకు చుక్కలు చూపిన ఆంధ్ర బౌలర్లు లోహిత్, కార్తీక్‌రెడ్డి



ఒడిశా వికెట్ తీసిన ఆనందంలో ఆంధ్ర ఆటగాళ్లు

అందుబాటులోకి 20 రకాల ప్రభుత్వ సేవలు

● డిజి లక్ష్మీ సేవాకేంద్రం ప్రారంభోత్సవంలో ఎంపీ, ఎమ్మెల్యే



డిజి లక్ష్మీ సేవా కేంద్రం ప్రారంభోత్సవంలో ప్రజాప్రతినిధులు

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): డిజి లక్ష్మీ సేవా కేంద్రంలో 20రకాల ప్రభుత్వ సేవలు అందుబాటులోకి వస్తాయని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ పేర్కొన్నారు. స్థానిక అశోక్‌నగర్‌లో నగరపాలక సంస్థ కమిషనర్ బాలస్వామితో కలిసి వారు డిజి లక్ష్మీ సేవా కేంద్రాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డీజీ లక్ష్మిపథకం కింద పట్టణ పేద మహిళలు నడిపే 10వేల కియోస్కుల ద్వారా సుమారు 20రకాల ప్రభుత్వ సేవలు అందుబాటులోకి వస్తాయన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలకు దరఖాస్తు చేసుకోవడం, ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్లు, ధ్రువపత్రాలు పొందవచ్చని తెలిపారు. దీంతో మధ్యవర్తుల ప్రమేయం లేకుండా తక్కువ ఖర్చుతో ప్రజలకు ప్రభుత్వ సేవలు అందుతాయని పేర్కొన్నారు. డిజి లక్ష్మీసేవాకేంద్రాల సంఖ్య పెంచుతామని, సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ, మెప్మా అధికారులు, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సీఐ సతీష్ కేసును సీబీఐకి అప్పగించాలి



ర్యాలీ నిర్వహిస్తున్న కుమ్మర శాలివాహన సంఘం నాయకులు

అనంతపురం రూరల్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): రైల్వే సీఐ సతీష్ కుమార్ మృతి కేసును సీబీఐకి అప్పగించాలని కుమ్మర శాలివాహన సంఘం నాయకులు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో సోమవారం ఆ సంఘం నాయకులు నల్ల బ్యాడ్జీలు ధరించి ర్యాలీ చేపట్టారు. క్లాక్‌టవర్ నుంచి సప్తగిరి సర్కిల్ మీదుగా ఎస్పీ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అక్కడ ఎస్పీకి వినతి పత్రం ఇచ్చారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ సీఐ అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటనపై పూర్తి స్థాయిలో విచారణ చేయాలన్నారు. పదిరోజులు గడిచినా ఇది హత్య..? ఆత్మహత్య..? అన్న విషయం తేలలేదన్నారు. హత్య అయితే నిందితులను కఠినంగా శిక్షించాలన్నారు. టీటీడీ పరకామణి కేసులోని నిందితులపై చర్యలు తీసుకోవాలన్నారు. సీఐ కుటుంబానికి పరిహారం అందించాలన్నారు. పిల్లల చదువుకు సహకరించాలన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు రామాంజనేయులు, ఓబులపతి, గోపాల్ మలరాయుడు, రామ్మోహన్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సాగునీటి సమస్య పరిష్కరిస్తాం

● బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీశ్‌బాబు




హంద్రీనీవా కాలువను పరిశీలిస్తున్న అధికారులు, బీజేపీ నాయకులు

ధర్మవరం, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): రైతుల సాగునీటి సమస్యను తీర్చడానికి మంత్రి సత్యకుమార్‌యాదవ్ ప్రత్యేక చొరవ తీసుకుంటున్నట్టు బీజేపీ ధర్మవరం నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీశ్‌బాబు తెలిపారు. ఈ మేరకు రామగిరి, కనగానపల్లి మండలాల వద్ద నీటిని తరలిచే మార్గాలు, సాంకేతిక అంశాలను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ ప్రణాళిక అమలైతే ధర్మవరం నియోజకవర్గానికి చెందిన 30 నుంచి 40 చెరువులకు దాదాపు టీఎంసీ నీరు అందే అవకాశం ఉందన్నారు. తద్వారా తాడిమర్రి, బత్తలపల్లి మండలాల పరిసర గ్రామాల ప్రాంతాలలోని వేలాది మంది రైతులకు సాగునీటి కొరత తీరుతుందని వివరించారు. రబీ సీజన్‌లో పంటలు వేసుకోవడానికి తక్షణం నీరు అందేలా చర్యలు తీసుకోవాలని మంత్రి సత్యకుమార్‌యాదవ్ అధికారులను ఆదేశించారని తెలిపారు. కార్యక్రమంలో నీటిపారుదలశాఖ అధికారులు శ్రీనివాసులు, రాఘవేంద్రరావు, సంతోష్‌నాయక్, రామాంజినాయక్, బీజేపీ నాయకులు ఆకులేటి వీరనారప్ప, బిల్లే శీన, పోతుకుంట రాజు, సోమ్లానాయక్ పాల్గొన్నారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాంప్...

పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి (జయంతి)



భవిష్యత్తు అంశాలను తెలిపే 'కాలజ్ఞానం' రచించిన పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి 1608 నవంబరు 25న వైఎస్ఆర్ (కడప) జిల్లా కంది మల్లయ్య పల్లెలో జన్మించారు. వీరబ్రహ్మం, బ్రహ్మంగారు, వీరప్ప యాచార్యులుగా పేరొందారు. కందిమల్లయపల్లె తర్వాతి కాలంలో బ్రహ్మంగారి మఠంగా ప్రసిద్ధి చెందింది. ప్రపంచంలో ఏ వింత జరిగినా ఇది బ్రహ్మంగారు తన కాలజ్ఞానంలో ఆనాడే చెప్పారంటూ ప్రజలు గుర్తుకు తెచ్చుకుంటూ ఉంటారు. కాలజ్ఞానంలో చెప్పినవన్నీ జరిగాయి. నందమూరి తారకరామారావు స్వయంగా శ్రీమద్విరాట్ వీరబ్రహ్మేంద్రస్వామి చరిత్ర సినిమాను నిర్మించి నటించారు. సీఎం అయ్యాక తెలుగుగంగ పథకానికి శంకుస్థాపన చేసి మఠానికి ఆనుకుని ఉన్న జలాశయానికి బ్రహ్మం సాగర్‌గా నామకరణం చేశారు. ప్రస్తుతం బ్రహ్మంగారి మఠం ఆంధ్రప్రదేశ్‌లోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలలో ఒకటి. 1693లో సజీవ సమాధి అయ్యారు.

సాధు వాస్వాని (జయంతి)



సాధు వాస్వాని 1897 నవంబరు 25న హైదరాబాద్ సింధ్ ప్రాంతంలో జన్మించారు. అసలుపేరు థన్వర్‌దాస్ లీలారామ్ వాస్వాని. విద్యలో విప్లవాత్మక మార్పులకోసం కృషి చేశారు. ఉపనిషత్తులు సహా బైబిల్, ఖురాన్‌లపై పట్టు సాధించారు. మహాత్మా గాంధీతో కలసి సహాయనిరాకరణ ఉద్యమంలో పాల్గొన్నారు. కోల్కత్తా కాలేజీలో ప్రొఫెసర్‌గా హిస్టరీ, ఫిలాసఫీలను బోధించారు. 1966 జనవరి 16న కన్నుమూశారు. ఆయన గౌరవార్థం ప్రత్యేక పోస్టల్ స్టాంప్ విడుదల చేశారు.

వీరేంద్ర హెగ్డే (పుట్టినరోజు)



'పద్మవిభూషణ్' గ్రహీత ప్రముఖ మానవతావాది డీ వీరేంద్రహెగ్డే 1948 నవంబరు 25న దక్షిణకన్నడ జిల్లా బంట్వాళ ప్రాంతంలో జన్మించారు. ధర్మస్థళలో ప్రసిద్ధి చెందిన మంజునాథస్వామి ఆలయానికి వంశపారంపర్య ధర్మకర్త (ధర్మాధికారి)గా కొనసాగుతున్నారు. ఆలయ ట్రస్టు ద్వారా సాహిత్యంతోపాటు సమాజసేవలందిస్తున్నారు. యోగా, నేచురోపతిని విస్తరింపచేయడంతోపాటు పలు చోట్ల పెళ్లిమండపాలు నిర్మించారు. ఆలయాల అభివృద్ధికి కృషి చేయడంతోపాటు నిరుపేదలకు చేయూత అందిస్తున్నారు. కర్ణాటక రత్న, పద్మశ్రీ, వంటి అత్యున్నత పురస్కారాలు అందుకున్నారు. 2022 నుంచి రాజ్యసభ సభ్యుడిగా కొనసాగుతున్నారు.

చిరుత సంచారంపై ఆందోళన

బెంగళూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): అటవీ ప్రాంతాలకు సమీపంలోని ప్రాంతాలలో పులుల, చిరుతల సంచారం తరచుగా ఉండడంతో గ్రామస్తులలో భయాందోళనలు నెలకొంటున్నాయి. హెచ్‌డీ కోటె తాలూకా బెళగనహళ్ళి గ్రామానికి చెందిన సోమశేఖరగౌడ ఇంటిపై చిరుత సంచరించిన అంశం వెలుగు చూసింది. శనివారం రాత్రి తోటవైపునుంచి వచ్చిన మగ చిరుత సోమశేఖర్ నివాసంపైకి వచ్చి మెట్లపైన కొంతసేపు ఉండి తిరిగి తోటవైపు వెళ్లింది. ఆదివారం ఉదయం సీసీకెమెరా పుటేజీలను సోమశేఖర్ పరిశీలించగా విషయం బయటపడింది. చిరుత వచ్చినవేళ ఎవరైనా ఉన్నా, ఆవులు, మేకలు ఉంటే బలయ్యేవి. ఈ విషయాన్ని అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు.

రేపు సుబ్రహ్మణ్య షష్ఠి



అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వరుడు

పెనుకొండ, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): స్థానిక పసరవక్కరి బావి వద్దున వెలసిన సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో మంగళవారం, బుధవారం రెండ్రోజులపాటు స్వామివారి షష్ఠి వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు అర్చకులు శేషప్పస్వామి తెలిపారు. మంగళవారం ఉదయం నుంచి ప్రాతఃకాల పూజ, మహామంగళహారతి, సాయంత్రం గంగపూజ, కలశస్థాపన, నవగ్రహపూజ, సామూహిక కుంకుమార్చన ఉంటుందన్నారు. బుధవారం 7 నుంచి మధ్యాహ్నం 12గంటలవరకు మహన్యాస పూర్వక ఏకాదశ వార రుద్రాభిషేకాలు, నవగ్రహ సుబ్రహ్మణ్యస్వామి, రుద్రాస్వాహాకార హోమం, రతాంగహోమం, పూర్ణాహుతి, మంగళహారతి నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బుధవారం ఉదయం 11-45కు సుబ్రహ్మణ్యస్వామి 25వ రతోత్సవాన్ని నిర్వహిస్తున్నామన్నారు. భక్తులు పెద్దఎత్తున పాల్గొని స్వామికృపకు పాత్రులు కావాలని ఆయన కోరారు.

బలవంతంగా భూముల స్వాధీనం సరికాదు

» రైతుసంఘం తాలూకా సమ్మేళనంలో వక్తలు

బాగేపల్లి, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రైవేటీకరణ, పారిశ్రామికీకరణ పేరిట రైతులనుంచి బలవంతంగా భూములు స్వాధీనం చేసుకుంటున్నాయని ఇది సమంజసం కాదని రైతుసంఘం రాష్ట్ర సమితి అధ్యక్షుడు యూ బసవరాజు మండిపడ్డారు. పట్టణంలోని కన్యకా పరమేశ్వరి కల్యాణమండపంలో సోమవారం కర్ణాటక ప్రాంత రైతుసంఘం (కేపీఆర్ఎస్) 14వ తాలూకా సమ్మేళనం జరిగింది. సమావేశాన్ని ప్రారంభించి మాట్లాడుతూ ప్రభుత్వాల తీరువల్ల రైతులను, సాగును ప్రమాదపు అంచున పడేస్తున్నారన్నారు. అన్నదాతలు దేశానికి వెన్నెముక అని కేవలం ప్రసంగాలకే పరిమితం చేయకుండా ఆచరణలో రైతులకు అండగా నిలవాలన్నారు. చాలాచోట్ల రైతులనుంచి బలవంతంగా భూములను తీసుకుని కార్పొరేట్ సంస్థలకు కట్టబెడుతున్నారన్నారు. ఇది దేశ ఆహార ఉత్పత్తికి పెను ప్రమాదమన్నారు. కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు రూపొందించే పాలసీలు అన్నదాతలకు మేలు చేకూరేలా ఉండాలన్నారు. లేనిపక్షంలో రైతులు కూలీలుగా మారిపోయే పరిస్థితి తలెత్తుతుందన్నారు. తమ హక్కులను కాపాడుకోవడం కోసం వ్యవసాయ కార్మికులు కలసికట్టుగా పోరాటం చేయాల్సి ఉందన్నారు. బగర్‌హుకుం సక్రమం చేయాలని రైతులు అర్జీలు సమర్పించి ఏళ్ల గడుస్తున్నా ఇంతవరకు మంజూరు కాలేదన్నారు. అర్జీ సమర్పించిన రైతులందరికీ బగర్‌హుకుం మంజూరుపత్రాలను పంపిణీ చేయాలన్నారు. ప్రాంతీయ వ్యవసాయకూలీల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎంపీ ముని వెంకటప్ప మాట్లాడుతూ చిక్క బళ్ళాపుర జిల్లాకు శాశ్వత నీరు కల్పించాలనే డిమాండ్‌కు పోరాటం అవసరం ఉందన్నారు. ఇప్పటికే కేపీఆర్ఎస్ నేతృత్వంలో శాశ్వత నీరుకోసం బాగేపల్లి నుంచి బెంగళూరుకు పాదయాత్ర జరిగిందన్నారు. కాంగ్రెస్, బీజేపీలకు ప్రత్యామ్నాయంగా సీపీఐను బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. సమ్మేళనంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సీ సూర్యనారాయణ, జయరామరెడ్డి, ముని కృష్ణప్ప, డీటీ మునిస్వామి, చన్నరాయప్ప తదితరులు పాల్గొన్నారు.



రైతుసంఘం పదాధికారులు

సాధకులకు ఆత్మీయ సత్కారం



వేదికపై సాధకుల బృందం

బెంగళూరు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): కర్ణాటక రాష్ట్ర ఏర్పాటై 70 వసంతంలో అడుగు పెట్టిన సందర్భంలో వివిధ రంగాల సాధకులను గుర్తించి సత్కరించారు. కర్ణాటక టీవీ, టాకింగ్ ప్యారెట్స్, ఏడీ6 అడ్వర్టైజింగ్ సంయుక్తంగా 'కరునాడ సుధారకరు' పేరిట కార్యక్రమాన్ని నిర్వహించాయి. రాష్ట్రం, భాష, నేల, నీరు అంశాలలో పదే పదే తలెత్తే అంశాలలో స్వాభిమానం చాటుకున్న సాధకులను సత్కరించారు. కన్నడమాత భువనేశ్వరి చిత్రపటానికి పూజలు చేశారు. సాధకుల సాధనను దృశ్యరూపంలో స్మరించారు. సాహితీ వేత్తలు, పోరాటవీరులు, విప్లవనాయకులు, వచన కారులు సహా ప్రతి జిల్లాలో ప్రముఖుల సమాచారం అందచే ఫలకాలను ప్రదర్శించారు. 70మంది సాధకుల సాధనను ఒక చక్కటి సినిమాను చూసిన అనుభూతి కల్పించారు. మాజీ సీఎం డీవీ సదానందగౌడ, మంత్రులు చలువ రాయస్వామి, సంతోష్‌లాడ్, రామలింగారెడ్డి, జమీర్ అహ్మద్‌ఖాన్ తదితరులు సాధకులను అభినందించారు. నాదబ్రహ్మ హంసలేఖ నేతృత్వంలో భువనేశ్వరికి గానపూజ చేశారు. బెంగళూరు గ్రామీణ ఎంపీ డాక్టర్ సీఎన్ మంజునాథ్, ఎమ్మెల్యేలు టీబీ జయచంద్ర, ఎస్ఆర్ విశ్వనాథ్, ఎం కృష్ణప్ప, సీకే రామమూర్తి, రవికుమార్ గణిగ, మునిరత్న, బసవరజా శివణ్ణనవర్, జవరాయిగౌడ పాల్గొన్నారు.

సంబరంగా కన్నడ రాజ్యోత్సవం

దొమ్మసంద్ర, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఆనేకల్ తాలూకా స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా దొమ్మసంద్ర శాఖలో తొలిసారిగా కన్నడ రాజ్యోత్సవాన్ని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులతో కలసి సోమవారం నిర్వహించారు. బ్యాంకు శాఖ మేనేజర్ శుభా నేతృత్వం వహించారు. ఆనేకల్ తాలూకా రాగిపంటకు ప్రసిద్ధి. దొమ్మసంద్రలో 1979లో స్టేట్ బ్యాంక్ ఆఫ్ మైసూరుశాఖ ఏర్పాటైంది. 2017లో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాగా మార్పు చెందింది. ఇదే తొలిసారిగా బ్యాంకుశాఖ ప్రాంగణంలో కన్నడ రాజ్యోత్సవాన్ని సోమవారం ఆచరించారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు పాల్గొనేలా అవకాశం కల్పించారు. కేఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి హరీశ్‌కుమార్ మాట్లాడుతూ ఆనేకల్ తాలూకాకు ఇటీవలికాలంలో దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాలనుంచి వస్తున్నారన్నారు. హిందీ, ఇంగ్లిష్, తెలుగు, తమిళం, మలయాళం సహా ఇతర భాషలవారు కన్నడ భాషను నేర్చుకోవాలని, కన్నడలో వ్యవహరించాలని విజ్ఞప్తి చేశారు. బ్యాంకు అధికారులు, సిబ్బంది కూడా కన్నడలో వ్యవహారాలను ప్రోత్సహించాలన్నారు. తొలుత కన్నడమాత భువనేశ్వరి దేవికి పూజలు చేశారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ లైఫ్ బిజినెస్ డెవలప్‌మెంట్ మేనేజర్ దిలీప్, సీనియర్ అసోసియేట్ శ్రీలక్ష్మి, అసిస్టెంట్ మేనేజర్ భాను ప్రకాశ్, ఉపాధ్యాయులు హేమ, మంజుళా, లక్ష్మి, రిటైర్డు టీచర్లు తదితరులు పాల్గొన్నారు.



కన్నడ రాజ్యోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు తదితరులు

సీఎం, డీసీఎంలకు ఆత్మీయ స్వాగతం

విజయపుర, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): శిడ్లఘట్టలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు దేవనహళ్ళి తాలూకా విజయపుర మీదుగా ముఖ్యమంత్రి సిద్దరామయ్య, డీసీఎం డీకే శివకుమార్‌లు బయల్దేరారు. సోమవారం మధ్యాహ్నం విజయపురకు చేరుకున్న సీఎం, డీసీఎంలను స్థానిక కాంగ్రెస్ నేతలు ఆత్మీయంగా స్వాగతం పలికారు. కేపీసీసీ కార్యదర్శి వీ మంజునాథ్ నేతృత్వంలో కార్యకర్తలు, అభిమానులు స్వాగతించారు. సన్మానం స్వీకరించిన అనంతరం సీఎం, డీసీఎంలు శిడ్లఘట్టకు బయల్దేరారు. ఈ సందర్భంగా పురసభ అధ్యక్షులు భవ్య మహేశ్, పురసభ మాజీ అధ్యక్షుడు, ప్రస్తుత సభ్యుడు ఎం సతీశ్‌కుమార్, సభ్యులు ఎం నారాయణస్వామి, ఇక్బాల్, బెంగళూరు గ్రామీణ జిల్లా మైనారిటీ విభాగం అధ్యక్షుడు ముబారక్, విజయపుర బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దిన్నూరు వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు. సీఎం, డీసీఎంల రాక సందర్భంగా అభిమానులు తరలివచ్చారు.





సీఎం, డీసీఎంలను స్వాగతిస్తున్న నాయకులు

అలరించిన రంగమంచ్ ప్రదర్శన

బెంగళూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): దాసరహళ్ళిలోని నారాయణ నీట్ అకాడమీ విద్యాసంస్థల ఆధ్వర్యంలో వసంతనగర్‌లోని అంబేడ్కర్ భవన్‌లో సోమవారం ఏర్పాటైన రంగమంచ్ 2025 కార్యక్రమం సందర్శకులను అలరించింది. ప్రత్యేకించి విద్యార్థులలోని నటనా చాతుర్యాన్ని ప్రోత్సహించేలా కార్యక్రమం చేపట్టినట్టు ఎగ్జిక్యూటివ్ డీన్ బీవీ నాగరాజు తెలిపారు. రామాయణం నాటకాన్ని విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా ప్రదర్శించారని నారాయణ విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ సింధూర నారాయణ కొనియాడారు. నారాయణ విద్యాసంస్థల అకడమిక్ హెడ్ డాక్టర్ ప్రమీళ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఇదే సందర్భంగా మెడికల్ సీట్లు సాధించిన 164మంది విద్యార్థులను సత్కరించారు. కేవలం పాఠాలకే పరిమితం కాకుండా నైతిక విలువలు పెంచే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. విద్యార్థులు విశేషంగా ఆకట్టుకున్నారు.



ప్రదర్శనను ప్రారంభిస్తున్న ప్రముఖులు



రామాయణం నాటికలో ఓ సన్నివేశం

ప్రేమ కోసం.. పెళ్లి కోసం..!

ఒకరి ఆత్మహత్య.. మరొకరి యత్నం

సోమందేపల్లి, గుడిబండ, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ప్రేమించిన అమ్మాయి దక్కలేదని ఒక యువకుడు ఆత్మహత్యకు యత్నించాడు. పెద్దలు తన పెళ్లి గురించి పట్టించుకోలేదని మరో యువకుడు ప్రాణాలను తీసుకున్నాడు. జిల్లాలో రెండు ప్రాంతాలలో సోమవారం ఈ విషాద సంఘటనలు చోటు చేసుకున్నారు.

● సోమందేపల్లి మండలం రంగేపల్లికి చెందిన సూర్యప్రకాశ్(24) ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు, సూర్యప్రకాశ్ గతంలో వలంటీరుగా పని చేసి, ప్రస్తుతం గ్రామంలోనే చిల్లర దుకాణం నిర్వహిస్తున్నాడు. తనకు పెళ్లి చేయాలని కొన్ని నెలలుగా కుటుంబ సభ్యులు, తల్లిదండ్రులను అడుగుతుండేవాడు. తన తోటివారికి, బంధువుల పిల్లలకు పెళ్లిళ్లు అవుతున్నాయని, తనకు ఎప్పుడు చేస్తారని ఇంట్లో వారిని నిలదీసేవాడు. పెళ్లికి అప్పుడేం తొందర వచ్చిందని వారు సోమవారం ఉదయం మందలించారు. దీంతో మనస్తాపం చెందిన సూర్యప్రకాశ్, ఇంటి నుంచి వెళ్లిపోయి గ్రామ సమీపంలోని గుట్ట వద్ద చెట్టుకు ఉరి వేసుకున్నాడు. కొద్దిసేపటి తర్వాత గొర్రెల కాపరులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.



సూర్యప్రకాశ్

● గుడిబండ మండలం మోపురుగుండు గ్రామానికి చెందిన ఈర రామప్ప, నాగమ్మ దంపతుల కుమారుడు రామాంజి పదో తరగతి వరకు చదువుకున్నాడు. ఐదేళ్ల నుంచి బెంగళూరులోని ఓ పరిశ్రమలో పని చేస్తున్నాడు. ఇదే మండలంలోని హిరేతుర్పి గ్రామానికి చెందిన ఓ అమ్మాయి, రామాంజి పరస్పరం ప్రేమించుకున్నారు. కుటుంబ సభ్యులు, బంధువుల సమక్షంలో ఇటీవల నిశ్చితార్థం జరిగింది. వచ్చే నెల 5, 6 తేదీల్లో పెళ్లికి ముహూర్తం పెట్టుకున్నారు. ఈలోపే ఆ అమ్మాయి వేరే అబ్బాయితో వెళ్లిపోయింది. ఈ విషయం తెలియగానే రామాంజి తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. బెంగళూరు నుంచి గుడిబండకు వచ్చి గొంతు కోసుకున్నాడు. పరిస్థితి విషమంగా ఉండటంతో బెంగళూరులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించామని కుటుంబ సభ్యులు తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజకుళ్లాయప్ప తెలిపారు.



రామాంజి

కేంద్రమంత్రి కుమారతో విజయేంద్ర భేటీ



కుమారస్వామికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న విజయేంద్ర

బెంగళూరు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): కేంద్ర భారీ పరిశ్రమలశాఖ మంత్రి కుమారస్వామిని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర ఢిల్లీలో సోమవారం భేటీ అయ్యారు. మర్యాదపూర్వకంగా పుష్పగుచ్ఛం అందచేశారు. రాష్ట్రంలో ఎన్డీయే మైత్రిని బలోపేతం చేయడంతోపాటు పాలనలో విఫలమైన కాంగ్రెస్ ప్రభుత్వం పట్ల పోరాటానికి కార్యాచరణపై చర్చించినట్టు నగరంలో విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.

హైస్కూల్ స్థాయి నుంచే పరిశోధనాసక్తి పెరగాలి



నెక్సస్ ఆఫ్ గుడ్ అవార్డు ప్రదానం

బెంగళూరు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): హైస్కూల్‌స్థాయి నుంచే పరిశోధనలపై ఆసక్తి పెంచేలా విద్యార్థులను ప్రోత్సహించాలని వక్తలు పేర్కొన్నారు. 9-12వ తరగతి విద్యార్థులకు ప్రయోగ ఇన్‌స్టిట్యూట్ ఎడ్యుకేషన్ రీసెర్చ్ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా 'అన్వేషణ' పేరిట విద్యార్థులను ప్రోత్సహిస్తోంది. విద్యార్థులలోని ప్రతిభను వెలికితీసేందుకు ఒక చక్కటి వేదికగా విద్య, పాలన, సామాజిక అంశాలపై అవగాహన కల్పిస్తోంది. గ్రీన్ కెమిస్ట్రీ, అడ్వాన్స్‌డ్ మెటీరియల్స్, ఎర్త్ సైన్సెస్, అగ్రికల్చరల్ సైన్సెస్‌ల ప్రాధాన్యతను వివరిస్తోంది. పోటీలలో ప్రత్యేకించి గ్రామీణ, గిరిజన ప్రాంత విద్యారులకు అవకాశం కల్పిస్తోంది. హార్వర్డ్, ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీలు ప్రచురితం చేసిన జర్నల్స్‌ను చదివే వీలు కల్పిస్తున్నామని ప్రయోగ మేనేజింగ్ ట్రస్టీ వల్లీశ్ హెరూరు తెలిపారు. రీసెర్చ్ విభాగం డైరెక్టర్ డాక్టర్ కేఎస్ నాగభూషణ పాల్గొన్నారు. ప్రయోగ ఇన్‌స్టిట్యూట్ సాధనలకు సంబంధించి నెక్సస్ ఆఫ్ గుడ్ అవార్డ్ లభించింది.

ఆవిష్కరణల కోసం కేడీఈఎం ప్రపంచ భాగస్వామ్యం

బెంగళూరు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): బెంగళూరు టెక్ సమ్మిట్ 2025లో ఏఐ సాంకేతిక గ్రామీణాభివృద్ధి, బీఎఫ్ఎస్ఐ ఆధునీకరణ లక్ష్యంగా కర్ణాటక డిజిటల్ ఎకానమీ మిషన్ (కేడీఈఎం) ప్రపంచ భాగస్వామ్యం కోసం ది ఇండస్ ఎంటర్‌ప్రెన్యూర్స్ (టీఐఈ) నేతృత్వంలో ప్రత్యేక కార్యాచరణ చేపట్టింది. స్ట్రాటిజిక్ ఫెలిటేటర్ పాత్రను నిభాయిస్తున్న కేడీఈఎం సంస్థ టీఐఈ న్యూజెర్సీ, టీఐఈ బెంగళూరు, న్యూట్రినోస్ సంస్థలు కలసికట్టుగా సాగుతున్నాయి. తద్వారా ఏఐతోపాటు ఇతర అంశాలలోనూ సరికొత్త ఆవిష్కరణలకు సాధ్యం కానుంది. గ్రామీణ ఉద్యమశీలత, వాతావరణ పరిస్థితులకు ప్రాధాన్యత ఇచ్చేలా ఏఐ సాంకేతికతతో పరిష్కారాలకు ప్రయత్నాలు సాగనున్నాయని కేడీఈఎం సీఈఓ సంజీవ్‌కుమార్ గుప్తా తెలిపారు. స్టార్టప్‌లకు మరింత దోహదం కానుందన్నారు.

పారాస్విమ్మింగ్‌లో పీఈఎస్ విద్యార్థికి బంగారు పతకం



పతకాలతో నవీన్ వెంకటేశ్

బెంగళూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ గచ్చిబౌలిలో జరిగిన 25వ నేషనల్ పారాస్విమ్మింగ్ చాంపియన్‌షిప్ పోటీలలో బెంగళూరు పీఈఎస్ యూనివర్సిటీ విద్యార్థి మూడు పతకాలు సాధించాడు. ఎంబీఏ రెండో సంవత్సరం చదువుతున్న నవీన్ వెంకటేశ్ పారస్విమ్మింగ్‌లో సత్తా చాటాడు. ఒక బంగారు, ఒక రజతం, ఒక కాంస్య పతకాన్ని సాధించాడు. 200 మీటర్ల వ్యక్తిగత విభాగంలో బంగార పతకం, 100 మీటర్ల బటర్‌ఫ్లై విభాగంలో రజతం, 50 మీటర్ల బటర్‌ఫ్లై విభాగంలో కాంస్యపతకం సాధించాడు. ఈమేరకు నవీన్ పీఈఎస్ యూనివర్సిటీ చాన్స్‌లర్ జవహర్ దొరస్వామి, వీసీ జే సూర్యప్రసాద్‌లు సోమవారం ప్రత్యేకంగా అభినందించారు. నవీన్ సాధన ఒక మైలురాయిగా నిలిచిందన్నారు.

కారును ఢీకొన్న బస్సు.. ముగ్గురికి గాయాలు

పెనుకొండ రూరల్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఈశ్వర్ రబ్బర్ ఫ్యాక్టరీవద్ద ముందు వెళ్తున్న కారును ఓవర్‌టెక్ చేయబోయి బస్సు ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన మేరకు గోరంట్లకు చెందిన ఇంతియాజ్ అత్త జమీలను అనంతపురం ఆసుపత్రిలో చికిత్సలు చేయిస్తున్నారు. ఆరోగ్యం కుదుటపడటంతో వారు ఇద్దరూ తిరుగు ప్రయాణమయ్యారు. ఈశ్వర్ రబ్బర్ ఫ్యాక్టరీవద్దకు రాగానే కియ అనుబంధ పరిశ్రమ సంగు హైటెక్ బస్సు అతివేగంగా ఓవర్‌టెక్ చేయబోయి కారును ఢీకొందన్నారు. ప్రమాదంలో కారులో ఉన్న ఇంతియాజ్, దస్తగిరి, జమీలలు స్వల్పంగా గాయపడ్డారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1623.73	1630.51
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	2,528	3,066
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	6,313	6,246
నీటి నిల్వ (టీఎంసీలు)	72.42	96.00

పాఠశాలల మూసివేతను అడ్డుకోవాలి

● ఏఐడీఎస్ఓ జిల్లా అధ్యక్షుడు ఈరన్న పిలుపు ● ప్రభుత్వం నిర్ణయం మార్చుకోకపోతే ఉద్యమిస్తామని హెచ్చరిక

బళ్లారి సిటీ, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): కేపీఎస్ మాగ్నెట్ ప్రాజెక్ట్ ఇబ్బందులో ఉందని, పాఠశాలల మూసివేత నిర్ణయాన్ని ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని ఏఐడీఎస్ఓ జిల్లా అధ్యక్షుడు ఈరన్న అన్నారు. సోమవారం పత్రికాభవన్‌లో ఆయన రాష్ట్రంలో మూసివేయబడుతున్న 40వేల ప్రభుత్వ పాఠశాలల జాబితాను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పాఠశాలలు మూసివేయం అని చెబుతూనే ప్రభుత్వం అదే దిశగా అడుగులు వేస్తోందన్నారు. అనేక మీడియా సంస్థలకు ఇంటర్వ్యూలు ఇస్తున్న రాష్ట్ర పాఠశాల విద్య , అక్షరాస్యత మంత్రి కేవలం ప్రకటనలు మాత్రం చేస్తున్నారన్నారు. కేపీఎస్ మాగ్నెట్ ప్రాజెక్ట్ పేరుతో కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వం 40వేల కంటే ఎక్కువ ప్రభుత్వ పాఠశాలలను మూసివేయడానికి అడుగులు వేస్తోందన్నారు. ప్రతి గ్రామ పంచాయితీకి ఒకటి చొప్పున రాష్ట్రంలో 6వేల కేపీఎస్ మాగ్నెట్ పాఠశాలలను స్థాపించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని, ఇది విద్యావ్యవస్థను నిర్వీర్యం చేయడమేనన్నారు. దీనికి వ్యతిరేకంగా బలమైన పోరాటం చేయాలని అన్ని రకాల త్యాగాలు చేయడానికి విద్యార్థి నాయకులు సిద్ధంగా ఉండాలన్నారు. పాఠశాలలు కాపాడుకోవడానికి అందరూ కదిలిరావాలని పిలుపునిచ్చారు. ఈసందర్భంగా ఏఐడీఎస్ఓ జిల్లా కార్యదర్శి కంబలి మంజునాథ్, కోశాధికారి అనుపమ, సభ్యులు తిప్పేస్వామి, మంజునాథ్, సోమశేఖర్ సమావేశంలో పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఈరన్న, సమావేశంలో కంబలి మంజునాథ్ తదితరులు

టెక్కలకోట పాలనా అధికారిగా గౌసియా బేగమ్

సిరుగుప్ప, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : టెక్కలకోట పట్టణ పంచాయతీ పాలనా అధికారిగా గౌసియా బేగమ్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. కౌన్సిలర్ల పదవీకాలం ముగియడంతో జిల్లా అధికారి ఆదేశాల మేరకు ఆమె అదనపు బాధ్యతలు చేపట్టారు. టెక్కలకోట పట్టణ పంచాయతీ పరిధిలోవార్డులలో తాగునీరు, పరిశుభ్రత, విద్యుత్ దీపాలు, పారం -3 సమస్యలు వుంటే నేరుగా సందర్శించి సమస్యలను పరిష్కరించుకోవాలని ఆమె పట్టణ ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా పట్టణ పంచాయతీ ముఖ్య అధికారి పరశురామ్ తదితరులు పాల్గొన్నారు.

బాలుడి అదృశ్యం

బళ్లారిరూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : బళ్లారి రూరల్ తాలుకాలోని చేళగుర్కికి ఎర్రితాత ఆలయం సమీపంలో బాలుడు అదృశ్యం అయ్యాడు. ఎర్రితాత పాఠశాలలో చదువుతున్న బాలుడు మల్లికార్జున (13) ఆస్పత్రికి వెళ్తున్నానని బళ్లారి వెళ్లాడు. అయితే ఇంటికి వెళ్లక పోవడంతో తల్లి పద్మ, పీడీఎల్‌ఈ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. బాలుడు కనిపిస్తే 9480803052 నెంబర్‌కు ఫోన్ చేయాలని పోలీసులు తెలిపారు.



మల్లికార్జున

రూ. 4.30 కోట్లతో ఆధునిక శ్మశాన వాటిక : ఎమ్మెల్యే

హోస్పేట్, నవంబరు 24, (ఆంధ్రజ్యోతి) హోస్పేట్ నగరం అభివృద్ధిలో మరో కీలకమైన అడుగుగా వైకుంఠ ధామ్‌లో రూ. 4.30 కోట్లతో ఆధునిక శ్మశానవాటికి నిర్మాణ పనులకు సోమవారం ఎమ్మెల్యే హెచ్, ఆర్ గవియప్ప శంకుస్థాపన చేశారు. భట్రల్లి ఆంజనేయ ఆలయానికి వెళ్లే రోడ్డులోని గుజ్జల్ జయలక్ష్మి లేఅవుట్ పక్కన మల్టీ ఫెసిలిటీతో ఈ ఆధునిక శ్మశానవాటిక నిర్మించడుతోంది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడతూ రాష్ట్రంలో ఐదు నగరాలకు మాత్రమే కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ ఈ ప్రాజెక్టు మంజూరు చేసిందని వాటిలో హోస్పేట ఉండటం అదృష్టం కాదు మా కృషి ఫలితం అన్నారు. ఏకంగా 4.5 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించబోయే ఈ వైకుంఠ ధామ్‌లో ప్రజలకు అవసరమైన అన్ని ప్రాథమిక సదుపాయాలు కల్పించనున్నట్లు తెలిపారు. విద్యుత్, గ్యాస్ ఆధారిత ఆధునిక చితాగ్ని సౌకర్యం, ప్రహరిగోడ, తాగునీరు, బాత్రూంలు, విశ్రాంతి గదులు ఉంటాయని ప్రజధనం ఆదా అయ్యేలా అంత్యక్రియలకు గౌరవం ఉండేలా మొత్తం ప్రాంగాణాన్ని తీర్చిదిద్దుతున్నామన్నారు. అభివృద్ధి పనుల పరంపరగా నవంబర్ 25న ఇంధన శాఖ మంత్రి కె.జె జార్జ్ సమక్షంలో బైలవద్దిగెరెలో రూ.9.15 కోట్లతో నిర్మించిన 110/11 కెవి సబ్ స్టేషన్ ప్రారంభం కానుందని అలాగే బైలవద్దిగెరెలో రూ. 27.65 కోట్లు, నాగేనహళ్లిలో రూ.22 కోట్లు వ్యయంతో నిరిశిస్తున్నా కొత్త సబ్‌స్టేషన్లకు కూడా ఇటివలే భూమిపూజ నిర్వహించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిల్ చైర్మన్, వైస్ చైర్మన్, సభ్యులు, మాజీ సభ్యులు, మున్సిపల్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే హెచ్‌ఆర్ గవియప్ప



పూజారి గాదెప్పను అభినందిస్తున్న కాంగ్రెస్ నాయకులు

మేయర్‌గా గాదెప్ప బాధ్యతల స్వీకరణ

● దుర్గమ్మ ఆలయంలో పూజలు నిర్వహించి ఊరేగింపుగా పాలికె కార్యాలయానికి..

బళ్లారి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): బళ్లారి మహానగర పాలికె మేయర్‌గా పూజారి గాదెప్ప సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గాదెప్ప ముందుగా బళ్లారి దుర్గామాత ఆలయంలో పూజలు నిర్వహించి అక్కడి నుంచి భాజాభజంత్రీలతో ఊరేగింపుగా మహనగర పాలికె వద్దకు చేరుకున్నారు. మేయర్ చాంబర్‌లో పూజలు చేయించారు. అనంతరం అధికారులు ఆయనకు బాధ్యతలు అప్పగించారు. ఈనెల 15న బళ్లారి మేయర్ ఎన్నికలు జరిగిన విషయం తెలిసిందే. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ అధిష్టాన వర్గం పూజారి గాదెప్పను పోటీలో నిలిపింది. బీజేపీ నుండి కోనంకి తిలక్ బరిలో ఉన్నా, కాంగ్రెస్ పార్టీలో మేయర్ అభ్యర్థికి కావాల్సిన కార్పొరేటర్ల బలం ఉండడంతో గాదెప్పకే పీఠం దక్కింది. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు అల్లం ప్రశాంత్, కల్యాణ స్వామి తదితరులు ఆయన్ని అభినందించారు.

సాంస్కృతిక పోటీల్లో బెస్ట్ విద్యార్థులు



రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

బళ్లారిరూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : బళ్లారి నగరంలోని 'బెస్ట్' కళాశాల విద్యార్థులు ప్రభుత్వ మున్సిపల్ పదవీపూర్వ కళాశాలలో జరిగిన జిల్లాస్థాయి సాంస్కృతిక పోటీల్లో సత్తాచాటి బీదర్ జిల్లా బసవ కళ్యాణంలో జరిగే రాష్ట్రస్థాయికి ఎన్నికయ్యారు. విద్యార్థులు సుష్మిత, మదన్‌కుమార్, ఐశ్వర్య, కావ్య, మహాలక్ష్మీ, కుసుమ, అర్చన, యామిని, హేమ తదితర విద్యార్థులు ఆంగ్ల, కెనడా వ్యాసరచన, క్విజ్, జానపద నృత్యం తదితర పోటీల్లో ప్రతిభ చాటారు. ఈ సందర్భంగా వారిని యాజమాన్యం అభినందించింది.

హాకీ పోటీల్లో బళ్లారి విద్యార్థులు...



హాసన్‌లో ట్రోఫీ అందుకుంటున్న బళ్లారి క్రీడాకారులు

బళ్లారి, నవంబరు 24, (ఆంధ్రజ్యోతి) అండర్- 14 హాకీ వేదికపై బళ్లారి స్పోర్ట్స్ హాస్టల్ విద్యార్థులు తమ సత్త చూపించారు. రాష్ట్రస్థాయి పోటీలు హాసన్‌లో 21 నుంచి 23 వరకు జరిగిన పోటీలలో బళ్లారి హాకీ ప్లేయర్లు ప్రత్యర్థులపై అధిపత్యం చాటుతూ విజేతులుగా నిలిచి బళ్లారి పేరును గర్వంగా వినిపించారు. ఈ పోటీల్లో మెరిసిన ఆటతీరుతో ఏడు మంది క్రీడ విద్యార్థులు జాతీయ స్థాయిలకు ఎంపిక కావడం స్థానికులు ఆనందం వ్యక్తం చేశారు. మణికాంత్, మహేష్, లోకేష్, గరౌవ్, ధనుష్, పాప్న్, పాండూరి జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక అయ్యినట్లు వ్యాయమ ఉపాధ్యాయులు తెలిపారు. ఐదుగురు స్పోర్ట్స్ హాస్టల్‌కు చెందినవారు కాగ, జూనియర్ కళాశాల విద్యార్థులు ఇద్దరు ఉన్నాట్లు తెలిపారు. విద్యార్థుల శ్రమ, కోచ్‌లు కఠిన శిక్షణ విద్యార్థుల క్రీడాస్ఫూర్తి కలిసి ఈజయానికి కారణమని నిర్వాహకులు తెలపారు.

తరచూ ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలి

● ఆర్‌సీహెచ్ అధికారి డాక్టర్ హనుమంతప్ప



గర్భిణులకు సూచనలు ఇస్తున్న హనుమంతప్ప

బళ్లారి సిటీ, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): గర్భిణులు నిత్యం ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని, ప్రతినెలా 9, 24 తేదీల్లో గర్భిణులకు ఆరోగ్య పరీక్షలు నిరంతరం నిర్వహిస్తున్నామని , అందరూ సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఆర్‌సీహెచ్ అధికారి డాక్టర్ హనుమంతప్ప సూచించారు. సోమవారం 'ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్' కార్యక్రమం నిర్వహించారు. సంగనకల్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, కమ్యూనిటీ హెల్త్ సెంటర్ మోకా, ఎర్రగుడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను సందర్శించి పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. గర్భం దాల్చిన 12 వారాలలోపు గర్భిణులు క్రమం తప్పకుండా వైద్యుల సలహాలు పాటించాలన్నారు. వైద్యుల సూచనల ప్రకారం ప్రతి నెలా బరువు, రక్తపోటు , ఇతర అవసరమైన పరీక్షలు చేయించుకోవడం ద్వారా ప్రసవ సమయంలో ఒత్తిడిని నివారించవచ్చన్నారు. తీవ్రమైన రక్తహీనత ఉన్నసందర్భాల్లో ఐఎఫ్ఏ మాత్రలు, ఐరన్ సుక్రోజ్ , రక్తమార్పిడి చికిత్స పొందాలన్నారు. బిడ్డ ఎటువంటి పెరుగదల లేకపోతే వెంటనే నిపుణుడి వద్దకు వెళ్లి అవసరమైన చికిత్స చేయించుకోవాలన్నారు. మొదటి డెలీవరీ శస్త్రచికిత్స ద్వారా జరిగితే తిరిగి గర్భదారణ కాలాన్ని కనీసం 3సంవత్సరాలుగా వాయిదా వేయాలన్నారు. వైద్యసిబ్బంది ప్రసూతి కార్డులను నిత్యం తనిఖీ చేయాలన్నారు. గర్భిణులు పోషకాహారం తీసుకోవడంతోపాటు వైద్యులు సూచించిన విధంగా ఉచితంగా ఐరన్ మాత్రలు తీసుకోవాలన్నారు. శారీరకంగా బలంగా ఉండటానికి కాల్షియం మాత్రలను తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ రేవణ సిద్దప్ప, డాక్టర్ భారతి, డార్టర్ శరశ్చంద్ర, డాక్టర్ సయ్యద్ హఫీస్, నర్సింగ్ అధికారులు, సిబ్బంది, తల్లులు పాల్గొన్నారు.

కళాకారులను గౌరవించడం అందరి కర్తవ్యం

● కళాబళగం అధ్యక్షుడు శివప్ప

గంగావతి రూరల్, నవంబరు 24, (ఆంధ్రజ్యోతి) కళాకారులను గౌరవించుకోవడం అందరి కర్తవ్యమని, తమ తమ రంగాల్లో మరుగు ప్రతిభతో సేవ చేస్తున్న వారిని గుర్తించి సన్మానించడం సమాజానికి ఎంతో అవసరమని ప్రముఖ పాత్రికేయుడు రామమూర్తి నావలి అన్నారు. సోమవారం గంగావతిలోని శ్రీ మాతా కొరకే స్టూడియోలో సప్త స్వర సాంస్కృతిక కళాబళగం ఆధ్వర్యంలో రాష్ట్రోత్సవ పురస్కార గ్రహీత విజయలక్ష్మిని ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా ప్రతిభావంతులు ఎంతో మంది ఉన్న వారికి సరైన వేదిక లభించక విద్యుత్ వెలుగులా మెరుస్తూ మారుమూలలో మగ్గిపోతున్నారన్నారు. అలాంటి వారిని గుర్తించి పురస్కారాలు, సన్మానాలు అందించడం సంస్థలకూ, సమాజానికి విలువ తెస్తుందని నావలి అన్నారు. కళాబళగం అధ్యక్షుడు శివప్ప మాట్లాడుతూ విజయలక్ష్మికి వచ్చిన పురస్కారం అన్ని గాయక వర్గానికి గర్వకారణమన్నారు. నగరసభ మాజీ సభ్యుడు ఆర్ కన్నన్ మాట్లాడుతూ సంగీత సేవలో గాయకులు మరింత ముందుకు రావాలని, రాబోయే రోజుల్లో పెద్ద స్థాయి పురస్కారాలను అందుకునేలా కృషి చేయాలని సూచించారు. టీ. శ్యామన్న దంపతులను సన్మానించారు. అనంతరం విజయలక్ష్మి మాట్లాడుతూ తన పురస్కారం వ్యక్తిగత గౌరవమే కాదు. అన్ని గాయకులకు దక్కిన గుర్తింపేనన్నారు. ఈ కార్యక్రమంలో వీరేష్ పప్పి, మంజునాథ్‌గౌడ్, ఖాజా సాబ్ ముఖ్యారు, హాజీ ఆలీ రుక్మద్దీన్‌సాబ్, విరేష్ హీరేమఠ, విజయ్‌కుమార్, అంబికా, మంజునాథ్ వత్తార్, మంజునాథ్ శంరణ్ణ దేవరమని, సత్యానారాయణ, ముస్తాక్, శివప్ప, కురుగోడు వెంకటేశ్, అమీరాలి తదితరులు పాల్గొన్నారు.



అవార్డు గ్రహీత విజయలక్ష్మిని సత్కరిస్తున్న సంఘం సభ్యులు

రాష్ట్రంలో పాలన అస్తవ్యస్తం

●సర్వోదయ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు చామరస మాలిపాటిల్



విలేకరులతో మాట్లాడుతున్న చామరస మాలిపాటిల్

రాయచూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : అధికారం కోసం కాంగ్రెస్ పార్టీలో ఏర్పడిన రెండు గ్రూప్ తగాదాలతో రాష్ట్ర పాలన అస్తవ్యస్తంగా మారిందని సర్వోదయ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు చామరస మాలిపాటిల్ అన్నారు. ఈ గందరగోళాన్ని నియంత్రించడంలో కాంగ్రెస్ పార్టీ హైకమాండ్ పూర్తిగా విఫలమైందని ఆయన ఆరోపించారు. పరిస్థితి ఇదే రీతిలో కొనసాగితే తమ పార్టీ రాష్ట్రంలో రాష్ట్రపతి పాలనకు డిమాండ్ చేసేందుకు వెనకాడబోదని స్పష్టం చేశారు. సోమవారం నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. శాసన సభ్యులు తమతమ నియోజక వర్గాల్లోని ప్రజాసమస్యల పరిష్కారం పై ఏ మాత్రం శ్రద్ధ లేకుండా గ్రూప్ రాజకీయాల్లో తలమునకలై డిల్లీ బాట పడుతుండడం బాధ్యరాహిత్యమన్నారు. నిజంగా కాంగ్రెస్ పార్టీలో అధికారం కోసం ఒప్పందం జరిగి ఉంటే మాటకు కట్టుబడి పదవిని తేజించి ప్రభుత్వం సుస్థిరంగా ఉండేందుకు సహకరించాలన్నారు. లేని పక్షంలో ఆయన మాట తప్పిన వాడిగా చరిత్రలో మిగిలిపోతాడని వ్యాఖ్యానించారు. కాగా తమ అధికారం కోసం కాంగ్రెస్ పార్టీ నాయకులు కీచులాటులు మాని ముందు ప్రజాసమస్యల పై దృష్టి సారించాలన్నారు. కాగా మూడు నూతన వ్యవసాయ బిల్లులకు వ్యతిరేఖంగా రైతు సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 26న బెంగళూరులో ఆందోళన నిర్వహిస్తున్నట్లు రైతు నాయకులు మాలిపాటిల్ చెప్పారు. రైతుల సంక్షేమం కోసం చేస్తున్న నిరసనకు అన్ని సంఘాలు మద్దతు పలకాలన్నారు. ప్రభుత్వం తక్షణమే రైతు సమస్యలు పరిష్కరించాలన్నారు.

హోసూరు జోన్

బీజేపీ యూనియన్ కార్యవర్గ సమావేశం



మాట్లాడుతున్న బీజేపీ నాయకుడు నారాయణన్

హోసూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): కృష్ణగిరి పశ్చిమ జిల్లా వేపనపల్లి ఉత్తర యూనియన్ బీజేపీ కార్యవర్గ సభ్యులు పదవీబాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమానికి వేపనపల్లి సౌత్ యూనియన్ అధ్యక్షుడు అధ్యక్షత వహించారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని నూతన పదాధికారులు పేర్కొన్నారు. ప్రత్యేక అతిథులుగా కృష్ణగిరి పశ్చిమ జిల్లా చైర్మన్ నారాయణన్, కృష్ణగిరి పశ్చిమ జిల్లా ప్రధాన కార్యదర్శి వేపనపల్లి శాసనసభ నిర్వాహకుడు అన్బరసన్, వేపనల్లి కో- ఆర్డినేటర్ అడ్వకేట్ సుందరమూర్తి, శూలగిరి సెంట్రల్ జోన్ అధ్యక్షుడు మంజునాథ్, కెలమంగలం పశ్చిమ జోన్ అధ్యక్షుడు విశ్వనాథ్, జిల్లా నిర్వాహకులు బృందం, డివిజన్ నిర్వాహకులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన తప్పనిసరి

●సైబర్ క్రైం డీఎస్పీ వెంకటేశ్



మాట్లాడుతున్న సైబర్ క్రైం డీఎస్పీ వెంకటేశ్

రాయచూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : నేటి సమాజంలో రోజు రోజుకు సైబర్ క్రైం నేరాలు పెరిగి పోతున్న నేపథ్యంలో వాటి పై ప్రతి విద్యార్థికి విధిగా అవగాహన కల్పించేందుకు అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని జడ్పీ సీఈఓ ఈశ్వర్ కాందూ సూచించారు. సోమవారం నగరంలోని జడ్పీ సమావేశ మందిరంలో వసతి నిలయాల వార్డన్‌లు, పాఠశాలల ప్రిన్సిపాల్‌లు, సూపర్‌వైజర్‌లకు సైబర్ క్రైం నేరాల అవగాహన పై ఒక రోజు కార్యాగారం నిర్వహించారు. సదస్సును ప్రారంభించిన జడ్పీ సీఈఓ సైబర్ నేరాల తీరు వాటి పై ఎదురవుతున్న సమస్యల గురించి విద్యార్థులకు విపులంగా వివరించాల్సిన అవసరం ఉందన్నారు. సైబర్ క్రైం డీఎస్పీ వెంకటేశ్ మాట్లాడుతూ సైబర్ నేరాలు జరుగుతున్న తీరు ఏ ఏ రకమైన నేరాల వల్ల ఇటీవల కేసులు పెరిగిపోతున్న వైనాన్ని విద్యార్థులకు వివరించారు. అదే సమయంలో అశ్లీల వీడియోలు, నకిలీ ఫెస్‌బుక్‌లు ఇతరత్ర వాటి పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆన్‌లైన్ ద్వార సైబర్ క్రైం జరిగిన వెంటనే ఎలాంటి ఆందోళన చండకుండా హెల్ప్‌లైన్ 193కి ఫోన్ చేయాలని లేదా సమీపంలోని పోలీస్ స్టేషన్‌లో వెంటనే ఫిర్యాదు చేయాలని సూచించారు.

పదిలో వందశాతం ఫలితాలు సాధించాలి

●జడ్పీ సీఈఓ ఈశ్వర్ కాందూ

రాయచూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : వసతి నిలయాలు, పాఠశాలల్లో విద్యపరంగా వెనకబడి ఉన్న విద్యార్థులను గుర్తించి వారికి ప్రత్యేక తరగతులు నిర్వహించాలని జడ్పీ సీఈఓ ఈశ్వర్ కాందూ సూచించారు. ఎప్పటికప్పుడు విద్యార్థులను పరీక్షలకు సమాయత్తం చేస్తూ ఈ ఏడాది టెన్త్(ఎస్ఎస్ఎల్‌సీ)ఫలితాలు వంద శాతం వచ్చేలా సంబంధిత శాఖల అధికారులు దృష్టి సారించాలన్నారు. సోమవారం నగరంలోని జడ్పీ సమావేశ మందిరంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వసతి పాఠశాలల సూపర్‌వైజర్‌లు, అధికారులతో జడ్పీ సీఈఓ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయా తాలూకాల్లోని విద్యార్థి వసతి నిలయాల్లో విద్యార్థుల సంఖ్య వారికి అందుతున్న భోజనం సాగుతున్న చదువు తదితర అంశాల గురించి జడ్పీ సీఈఓ ఆరా తీశారు. కొంతమంది వసతి నిలయాలకు ట్యూషన్ చెప్పేందుకు వచ్చే వారు సకాలంలో రావడం లేదన్న ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో ఇందుకు అక్కడి వార్డన్‌ల పై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అదే సమయంలో లింగసుగూరు, దేవదుర్గ తాలూకాల్లో బాల్య వివాహాలు ఎక్కువగా జరుగుతుండడం తరచు విద్యార్థులు పాఠశాలలకు గైర్హాజరవుతుండాన్ని ప్రస్తావించిన జడ్పీ సీఈఓ సంబంధిత అధికారులు వెంటనే వీటి నివారణకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

వీల్ చైర్ల పంపిణీ

పావగడ, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): తాలూకా పంచాయతీ కార్యాలయంలో సోమవారం ఎమ్మెల్యే హెచ్‌వీ వెంకటేశ్, ఈఓ ఉత్తం, తహసీల్దార్ రవి దివ్యాంగులకు వీల్‌చైర్లు పంపిణీ చేశారు. ప్రతి గ్రామ పంచాయతీ నుంచి మూడు శాతం నిధులతో సేకరించిన నగదు నుంచి జిల్లా పంచాయతీ, తాలూకా పంచాయతీ తరఫున ప్రతి సంవత్సరం ఈ కార్యక్రమం చేపడుతున్నట్లు ఈఓ తెలిపారు. అనంతరం కేడీపీ సభలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. ప్రతి పీడీఓ నియామానుసారం గ్రామసభల ద్వారా సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషిచేయాలని సూచించారు. కార్యక్రమంలో అన్నిశాఖల అధికారులు పాల్గొన్నారు.

మండిపోతున్న కూరగాయల ధరలు

హోసూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): హోసూరు రైతుబజారుకు సరఫరా లేకపోవడం వల్ల కూరగాయల ధరలు పెరిగాయి. దీంతో మధ్యతరగతి ప్రజలు ఆందోళన చెందుతున్నారు. హోసూరు తాలూకా కార్యాలయం సమీపంలో ఉన్న రైతు బజారు తమిళనాడులో 2వ అతి పెద్ద మార్కెట్ ఇక్కడ 300కు పైగా దుకాణాలు ఉన్నాయి, హోసూరు పరిసర ప్రాంతాల నుంచి రైతులు తమ పొలాల్లో పండించిన కూరగాయలు, ఆకుకూరలు, పండ్లను అమ్మకానికి ఇక్కడి మార్కెట్‌కు తీసుకొస్తారు. ప్రతిరోజూ సరిహద్దులోని అత్తిబెలె, హోసూరు, చుట్టుపక్కల ప్రాంతాల మార్కెట్‌కు వచ్చి తమకు అవసరమైన కూరగాయలు కొనుగోలు చేస్తారు. రోజుకు సుమారు 110 టన్నుల కూరగాయలు అమ్ముడవుతుంటాయి. గత వారం వర్షాల కారణంగా టమోటాలు, కూరగాయలు కొంతమేర దెబ్బతిన్నాయి. దీంతో రైతు బజారుకు 100 టన్నులు మాత్రమే కూరగాయలు వస్తున్నాయి. ఈ కారణంగా కూరగాయల ధరలు కొంత పెరిగాయి. గత వారం టమోటా కిలో రూ.18 నుంచి రూ.25 వరకు ఉండగా ప్రస్తుతం రూ.70-80 వరకు పలుకుతోంది. బెండకాయ గతవారం కిలో రూ.35 ఉండగా ప్రస్తుతం రూ.70-80 వరకు ఉంటోంది. బీన్స్, క్యారెట్, క్యాబేజి, కాలీఫ్లవర్ తదితర దరలు రెట్టింపు అయ్యాయి.

ఎవరి కోసం..?

(5వ పేజీ తరువాయి) రైతులు ఆసక్తి చూపడం లేదు.

రైతులు రావడం లేదు : పౌరసరఫరాల శాఖ అధికారి షకీనా

ప్రభుత్వ కొనుగోళ్ల కేంద్రాల్లో వరి రైతులు ధాన్యం విక్రయించడం లేదు. చాలా మంది మిల్లర్లకు, దళారులకు అమ్ముకుంటున్నారు. బళ్లారి జిల్లాలో సిరుగుప్ప, కంప్లి, బళ్లారి మూడు చోట్ల వరి, రాగి, జొన్న కొనుగోళ్ల కేంద్రాలు ఏర్పాటు చేశాము. రాగి, జొన్న పంటను ఎక్కువ మంది రైతులు ప్రభుత్వ కొనుగోళ్ల కేంద్రాలకు విక్రమిస్తున్నారు. వరి రైతులు ఆసక్తి చూపడం లేదు.

కఠిన నిబంధనలు : వాసుయాదవ్



కొనుగోలు కేంద్రాల్లో మితిమీరిన నిబంధనలు విధించారు. నేను 5 ఎకరాల్లో వరి పంట పండించాను. ప్రభుత్వ కేంద్రాల్లో 50 క్వింటాళ్ల మించి కొనరు. నాకు 200 క్వింటాళ్ల పంట వచ్చింది. ఒక వేల 50 క్వింటాళ్‌ను ప్రభుత్వం కొనుగోళ్ల కేంద్రలో అమ్ముకుంటే మిగిలిన నిల్వ ఎక్కడ అమ్ముకోవాలి. అందుకే పంట అంతా మిల్లుకే తరలిస్తున్నా. ప్రభుత్వం రైతులను ఆదుకునేందుకు చర్యలు తీసుకున్నా అది వృథాగానే మారింది.

వారం నుంచి తిరుగుతున్నా : సంతోష్ రెడ్డి, బైరదేవన హళ్లి



పంట కోసి వారం అయింది. గింజలు సంచుల్లోకి వేస్తామంటే సంచులు ప్రభుత్వం వారు ఇవ్వడం లేదు. అనసవర నిబంధనలతో చుక్కలు చూపిస్తున్నారు. అందుకే బయట వ్యాపారులకు అమ్ముకుంటున్నాను. ప్రభుత్వం నిబంధనలు సడలించకపోతే కొనుగోలు కేంద్రాలతో ఎలాంటి ఉపయోగం లేదు. బయట వ్యాపారులకు, దళారులకు చెల్లించడానికే అధిక మొత్తం అయిపోతోంది. దీంతో కొనుగోలు కేంద్రాలు వృథాగా మారియి. ప్రభుత్వం నిబంధనలు సడలించాలి.

బుద్ధిమాంద్యం పిల్లలకు పాలు, పండ్ల పంపిణీ

సిరుగుప్ప, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రిటైర్డ్ డీజీపీ ప్రవీణ్ జన్మదినం సందర్భంగా తాలుకా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సంఘం ఆధ్వర్యంలో సోమవారం బుద్ధిమాంద్య విద్యార్థులకు యూనిఫారమ్, బ్రెడ్డు, పాలు, పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా న్యాయవాది మునుస్వామి మాట్లాడుతూ ప్రవీణ్ డీజీపీగా ఎన్నో ఉత్తమ సేవలు అందించారని కొనియాడారు. ఈ సందర్భంగా సంఘం తాలుకా అధ్యక్షుడు చిక్కబళ్లారి నాగప్ప, ప్రముఖ నాయకులు చలవాది లోకేష్, దుర్గప్ప, మాజీ కౌన్సిలర్ చిదానందరాయుడు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పిల్లలతో అంబేడ్కర్ సంఘం నాయకులు